ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHY 5

తమిళనాడు
TAMILNADU

బుధవారం 10 సెప్టెంబరు 2025

ఎన్నికలయ్యే వరకు

'నో రెస్ట్'

● డీఎంకే జిల్లా నేతలకు స్టాలిన్ దిశా నిర్దేశం



జిల్లా నేతలతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహిస్తున్న డీఎంకే అధ్యక్షుడు స్టాలిన్

చెన్నై, సెప్టెంబరు 9 (ఆంధ్రజ్యోతి): అసెంబ్లీ ఎన్నికలు పూర్తయ్యేవరకూ 'విశ్రాంతి' అనే మాట మరిచి, పార్టీ కోసం ముమ్మరంగా ప్రచారం చేసి కూటమి అభ్యర్థులను గెలిపించాలని జిల్లా కార్యదర్శులకు డీఎంకే అధ్యక్షుడు, ముఖ్యమంత్రి స్టాలిన్ పిలుపునిచ్చారు. మంగళవారం ఉదయం క్యాంపు కార్యాలయం నుంచి జిల్లా కార్యదర్శులతో ఆయన వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఆ సందర్భంగా స్టాలిన్ మాట్లాడుతూ.. పదేళ్ల అన్నాడీఎంకే ప్రభుత్వ హయాంలో పాతాళానికి చేరుకున్న ఆర్థిక పరిస్థితిని మెరుగుపరచడంలో ద్రావిడ తరహా డీఎంకే ప్రభుత్వం విజయం సాధించిందని, గడిచిన నాలుగున్నరేళ్లలో అమలు చేసిన సంక్షేమ పథకాల ద్వారా రాష్ట్ర ఆర్థిక పరిస్థితి 11.19 శాతానికి పెరిగిందని, రాష్ట్రాన్ని పారిశ్రామికపరంగా అభివృద్ధి చేసే దిశగా ఇటీవల తాను జరిపిన జర్మనీ, ఇంగ్లండ్ దేశాల పర్యటలో భారీగా పారిశ్రామిక పెట్టుబడులను సమీకరించానని చెప్పారు. విదేశీ పర్యటనలో రూ.15,516 కోట్ల పెట్టుబడులు సమీకరించడంతో పర్యటన 'సూపర్ హిట్' అయ్యిందన్నారు. రాష్ట్ర ఆర్థిక పరిస్థితిని ట్రిలియన్ డాలర్లకు పెంచాలన్న లక్ష్యాన్ని త్వరగా చేరుకోవాలంటే పెట్టుబడుల సమీకరణ, విదేశీ పర్యటనలు చాలవని, రాబోయే అసెంబ్లీ ఎన్నికల్లో గెలవాల్సిన అవసరం ఉందని, ఆ దిశగానే జూలై 3న 'ఏకతాటిపై తమిళనాడు' అనే ఉద్యమాన్ని ప్రారంభించినట్లు ఆయన చెప్పారు. ఈ పరిస్థితుల్లో అసెంబ్లీ ఎన్నికలు పూర్తయ్యేంత వరకూ జిల్లా కార్యదర్శులు, నగర, పట్టణ శాఖ కార్యదర్శులే కాకుండా పార్టీ కార్యకర్తలు, బూత్ కమిటీ ఇన్‌చార్జులు 'విశ్రాంతి' అనే మాటే మరచిపోవాలని, నిద్రాహారాలు కూడా పట్టించుకోకుండా పార్టీ అభ్యర్థులు, కూటమి అభ్యర్థుల విజయం కోసం తీవ్రంగా శ్రమించాలని విజ్ఞప్తి చేశారు. ఈ నెల 15న అన్నాదురై జయంతి సందర్భంగా 68 వేల పోలింగ్ కేంద్రాల ఇన్‌చార్జులు అసెంబ్లీ ఎన్నికల్లో డీఎంకే, కూటమి అభ్యర్థుల విజయానికి పాటుపడతామని శపథం చేయాలన్నారు. అన్నాదురై జయంతి వేడుకలు పూర్తయిన తర్వాత 20 నుంచి రాష్ట్ర వ్యాప్తంగా 'ఏకతాటిపై తమిళనాడు' ప్రచార కార్యక్రమాన్ని, సభ్యత్వ కార్యక్రమాన్ని నిర్వహించాలని జిల్లా కార్యదర్శులకు ఆదేశాలిచ్చారు. రాష్ట్రంలో మరో మారు ద్రావిడతరహా డీఎంకే ప్రభుత్వం ఏర్పాటు కోసం పార్టీ శ్రేణులంతా సమష్టిగా కృషి చేయాలని స్టాలిన్ పిలుపునిచ్చారు.

తిరుప్పూర్ నుంచి రాష్ట్రపతి భవన్‌కు...

ఉప రాష్ట్రపతిగా

మన సీపీఆర్



భారత ఉపరాష్ట్రపతిగా రాష్ట్రానికి చెందిన సీనియర్ నేత సీపీ రాధాకృష్ణన్ (సీపీఆర్) ఎన్నికవడం పట్ల రాష్ట్ర వ్యాప్తంగా హర్షాతిరేకాలు వ్యక్తమవుతున్నాయి. రాజకీయంగా ఆయన ఎన్నికను విభేదించినప్పటికీ.. వివిధ పార్టీల నేతలు వ్యక్తిగతంగా ఆయన్ని అభినందిస్తున్నారు. రాష్ట్రం గర్వంగా తలెత్తుకునేలా రాజ్యాంగానికి కట్టుబడి పని చేయాలంటూ పలువురు నేతలు, సన్నిహితులు శుభాకాంక్షలు తెలిపారు. సీపీఆర్ విజయం ఖరారు కాగానే రాష్ట్ర వ్యాప్తంగా బీజేపీ శ్రేణులు సంబరాలు చేశాయి. నిజానికి రాష్ట్రం నుంచి సీపీ రాధాకృష్ణన్‌కు అన్నాడీఎంకేకు చెందిన ఐదు ఓట్లు మాత్రమే దక్కాయి. మిగిలిన ఓట్లన్నీ డీఎంకే మిత్రపక్షాలవే కావడంతో 'ఇండి' అభ్యర్థి జస్టిస్ సుదర్శన్ రెడ్డికే మరలినట్లయింది.

- చెన్నై, ఆంధ్రజ్యోతి.

ఆది నుంచి సౌమ్యుడే...

1957 అక్టోబరు 20న తిరుప్పూర్‌లో సీకే పొన్నుస్వామి-కె.జానకి దంపతులకు జన్మించిన చంద్రపురం పొన్నుస్వామి రాధాకృష్ణన్ (సీపీఆర్)కు ఆది నుంచి సౌమ్యుడిగా పేరుంది. ఆయన రాజకీయ విధానాలను విభేదించే నేతలు సైతం.. వ్యక్తిగతంగా ఎంతో గౌరవిస్తారు. ఆయనకు భార్య సుమతి, ఇద్దరు పిల్లలున్నారు. తూత్తుకుడిలోని వీవోసీ కాలేజీలో బీబీఏ చేసిన రాధాకృష్ణన్.. టేబుల్ టెన్నిస్‌లో కాలేజీ ఛాంపియన్‌గా నిలిచారు. బాల్యం నుంచే ఆయన ఆర్ఎస్ఎస్, భారతీయ జనసంఘ్‌లతో మమేకమయ్యారు. 1974లో జనసంఘ్ రాష్ట్ర ఎగ్జిక్యూటివ్ కమిటీ సభ్యుడిగా నియమితులైన ఆయన 1980లో బీజేపీలో చేరారు. 1998 ఫిబ్రవరిలో కోయంబత్తూరులో జరిగిన వరుస బాంబు పేలుళ్ల అనంతరం జరిగిన పార్లమెంటు ఎన్నికల్లో సీపీ రాధాకృష్ణన్ కోవై లోక్‌సభ స్థానం నుంచి పోటీ చేసి లక్షా 50 వేల పైచిలుకు మెజారిటీతో విజయం సాధించారు. మళ్లీ 1999లో జరిగిన పార్లమెంటు ఎన్నికల్లో అదే స్థానం నుంచి 55 వేల వేట్ల మెజారిటీతో తన సత్తా చాటారు. ఎన్‌డీఏతో డీఎంకే పొత్తు ముగిశాక 2004లో అన్నాడీఎంకేను ఆ కూటమిలోకి రప్పించేందుకు కృషి చేసిన బీజేపీ నేతల్లో సీపీఆర్ కూడా ఒకరు. ఐక్యరాజ్యసమితికి వెళ్లిన భారత పార్లమెంటరీ ప్రతినిధి బృందంలో సభ్యుడిగా వున్న సీపీఆర్.. ఐక్యరాజ్య సమితి 58వ సమావేశంలో ప్రసంగించారు. అయితే 2004లో జరిగిన ఎన్నికల్లో సీపీఐ నేత కె.సుబ్బరాయన్ చేతిలో పరాజయం పాలైన ఆయన.. మళ్లీ పార్లమెంటు మెట్లెక్కలేదు. 2014, 2019లో కూడా ఆయన కోయంబత్తూరు నుంచి పోటీ చేసినా విజయం సాధించలేకపోయారు. 2004 నుంచి రెండేళ్లపాటు బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడిగా బాధ్యతలు నిర్వర్తించిన సీపీఆర్.. దేశవ్యాప్తంగా నదులను అనుసంధానించాలని, అంటరానితనాన్ని నిర్మూలించాలని, ఉగ్రవాదాన్ని చెరిపేయాలని కోరుతూ 93 రోజుల పాటు రాష్ట్ర వ్యాప్తంగా రథయాత్ర చేపట్టారు. తరువాత బీజేపీ జాతీయ కార్యవర్గంలోనూ పని చేశారు.

రాష్ట్రం నుంచి మూడో ఉపరాష్ట్రపతి

తమిళనాడు నుంచి ఇప్పటి వరకు ఇద్దరు ఉపరాష్ట్రపతి పదవిని అధిరోహించారు. దేశ రెండో రాష్ట్రపతిగా పని చేసిన సర్వేపల్లి రాధాకృష్ణన్ తొలి ఉపరాష్ట్రపతి. రాష్ట్రం నుంచి ఎన్నికైన తొలి ఉపరాష్ట్రపతి కూడా ఆయనే. మొదట 1952 మే 13 నుంచి 1957 మే 13 వరకు ఉపరాష్ట్రపతిగా, రాజ్యసభ చైర్మన్‌గా వ్యవహరించిన ఆయన.. వరుసగా రెండో మారు కూడా 1957 మే 13 నుంచి 1962 మే 13 వరకు ఉపరాష్ట్రపతి పదవిలో వున్నారు. అనంతరం ఆయన రాష్ట్రపతిగానూ వ్యవహరించారు. ఆ తరువాత కాంగ్రెస్ సీనియర్ నేత ఆర్.వెంకట్రామన్ ఉప రాష్ట్రపతిగా (31.8.1984-24.7.1987) వ్యవహరించడంతో పాటు ఆ తరువాత జరిగిన పరిణామాల్లో రాష్ట్రపతి పదవి కూడా అధిరోహించారు. నాలుగు దశాబ్దాల తరువాత మళ్లీ రాష్ట్రాన్ని ఉపరాష్ట్రపతి పదవి వరించింది. ఉపరాష్ట్రపతి పదవికి వివిధ కారణాలతో జగ్‌దీప్ ధన్‌ఖడ్ రాజీనామా చేయడంతో ఎన్నిక అనివార్యమైంది. ఎన్‌డీఏ అభ్యర్థిగా బరిలోకి దిగిన సీపీ రాధాకృష్ణన్ ఉపరాష్ట్రపతిగా విజయం సాధించడంతో పాటు రాష్ట్రం నుంచి ఆ పదవికి ఎన్నికైన మూడో వ్యక్తిగా రికార్డులకెక్కారు.

4 రాష్ట్రాలకు గవర్నర్‌గా...

సీపీఆర్‌కు పార్టీ పట్ల ఎనలేని విధేయత, భవిష్యత్ ప్రణాళికల్లో వ్యూహరచన వంటివి గమనించిన ప్రధాని నరేంద్రమోదీ.. ఆయనకు గవర్నర్ గిరీ కట్టబెట్టారు. అనతికాలంలోనే ఆయన నాలుగు రాష్ట్రాలకు గవర్నర్‌గా వ్యవహరించడం విశేషం. 2023 ఫిబ్రవరి 18న జార్ఖండ్ గవర్నర్‌గా పదవీప్రమాణం చేసిన సీపీఆర్.. 2024 మార్చి 19న తెలంగాణ, పుదుచ్చేరి రాష్ట్రాలకు ఇన్‌చార్జ్ గవర్నర్‌గా కొంత కాలం అదనపు బాధ్యతలు నిర్వర్తించారు. అనంతరం 2024 జూలై 27 నుంచి మహారాష్ట్ర గవర్నర్‌గా వ్యవహరిస్తున్నారు. దక్షిణభారత వ్యక్తికి ఉపరాష్ట్రపతి పదవి ఇవ్వాలని నిర్ణయించిన ప్రధాని.. సీపీ రాధాకృష్ణన్‌ను ఎన్‌డీఏ అభ్యర్థిగా నిర్ణయించారు. నిజానికి దక్షిణాది నుంచి ఎన్‌డీఏకు గణనీయ బలం లేకపోయినా మంగళవారం జరిగిన ఎన్నికల్లో ఆయన భారత 15వ ఉపరాష్ట్రపతిగా ఘన విజయం సాధించారు.

బీజేపీ శ్రేణుల సంబరాలు

సీపీఆర్ ఉపరాష్ట్రపతిగా విజయం సాధించడంతో రాష్ట్రవ్యాప్తంగా బీజేపీ శ్రేణులు సంబరాలు జరుపుకున్నాయి. టి.నగర్‌లోని పార్టీ కార్యాలయం కమలాలయంలో బీజేపీ నేతలు, కార్యకర్తలు ఆనందం వ్యక్తం చేస్తూ ప్రజలకు మిఠాయిలు అందజేశారు. కోవై, తిరుప్పూర్, వేలూరు సహా అన్ని జిల్లాల్లో బీజేపీ శ్రేణులు బాణసంచా కాల్చుతూ సందడి చేశారు. బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు నయినార్ నాగేంద్రన్ తదితర నేతలంతా కార్యకర్తలకు మిఠాయిలు పంచుతూ సంతోషం వ్యక్తం చేశారు. వారంతా సీపీఆర్‌కు శుభాకాంక్షలు తెలిపారు. అదే విధంగా అన్నాడీఎంకే అధినేత ఎడప్పాడి పళనిస్వామి, పీఎంకే నేత డాక్టర్ అన్బుమణి, ఏఎంఎంకే నేత టీటీవీ దినకరన్, టీఎంసీ నేత జీకే వాసన్ తదితరులు సీపీఆర్‌కు శుభాకాంక్షలు తెలిపారు.



నయినార్ నాగేంద్రన్‌కు మిఠాయి తినిపిస్తున్న బీజేపీ నేతలు

డీఎంకేనే వెంటిలేటర్‌పై ఉంది

● డిప్యూటీ సీఎంకు ఈపీఎస్ కౌంటర్

పారీస్, సెప్టెంబరు 9 (ఆంధ్రజ్యోతి): అన్నాడీఎంకే ఐసీయూలో ఉందని వ్యాఖ్యానించిన డిప్యూటీ సీఎం ఉదయనిధికి కౌంటర్ ఇచ్చేలా అన్నాడీఎంకే ప్రధాన కార్యదర్శి ఈపీఎస్ ఘాటుగా విమర్శించారు. వారి పార్టీ వెంటిలేటర్‌పై ఉందన్న వాస్తవాన్ని గ్రహించకుండా అన్నాడీఎంకే ఐసీయూలో ఉందని ఉదయనిధి మాట్లాడటం హాస్యాస్పదంగా ఉందన్నారు. 'మక్కలై కాప్పోం-తమిళగత్తై మీడ్పోం' నినాదంతో ప్రారంభమైన ఈపీఎస్ ప్రచారయాత్ర మంగళవారం రెండో సారి కోవై జిల్లాకు చేరుకుంది. తొండాముత్తూరు నియోజకవర్గ పరిధిలోని సెల్వపురంలో మాజీ మంత్రి ఎస్పీ వేలుమణి, ఎమ్మెల్యే అమ్మన్ అర్జునన్ ఏర్పాటు చేసిన రోడ్ షోలో ఈపీఎస్ మాట్లాడతూ, డీఎంకే ప్రభుత్వ అవినీతిని ఎండగట్టేందుకే అన్నాడీఎంకేను స్థాపించిన ఎంజీఆర్ ప్రజాదరణతో రాష్ట్రాన్ని 25యేళ్లకు పైగా పరిపాలించి ప్రజలకు అన్ని విధాలా లబ్ధిచేకూర్చారని, ఆయన బాటలో పయనించిన మాజీముఖ్యమంత్రి జయలలిత కూడా రాష్ట్రాభివృద్ధికి ఎనలేని కృషిచేశారన్నారు. డీఎంకే ప్రభుత్వంలో శాంతిభద్రతలు క్షీణించాయని ఆరోపించారు. వచ్చే ఏడాది జరగనున్న అసెంబ్లీ ఎన్నికల్లో డీఎంకే ప్రభుత్వాన్ని ఇంటికి సాగనంపేందుకు ప్రజలు సిద్ధంగా ఉన్నారని, అయితే ఈ వాస్తవాన్ని గ్రహించకుండా ఉదయనిధి అన్నాడీఎంకే ఐసీయూలో ఉందని చెబుతున్నారని, నిజానికి వెంటిలేటర్‌లో ఉన్నది డీఎంకేనే అని ఈపీఎస్ కౌంటర్ ఇచ్చారు.



రోడ్‌షోలో మాట్లాడుతున్న ఎడప్పాడి పళనిస్వామి

యువనేత ప్రచార సన్నాహం

● నియోజక వర్గాలవారీగా ఉదయనిధి పర్యటన

● కంచిలో అన్నాదురై నివాసం నుంచి ప్రారంభం

చెన్నై, సెప్టెంబరు 9 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో అసెంబ్లీ నియోజకవర్గాల నేతలతో సమీక్షించేందుకు డీఎంకే యువజన విభాగం కార్యదర్శి, ఉప ముఖ్యమంత్రి ఉదయనిధి మంగళవారం పర్యటన ప్రారంభించారు. కాంచీపురంలోని డీఎంకే వ్యవస్థాపకుడు, మాజీ ముఖ్యమంత్రి అన్నాదురై నివాసంలో ఆయన విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించిన మీదట ఆయన పర్యటనకు శ్రీకారం చుట్టారు. మంగళవారం సాయంత్రం కాంచీపురంలో పార్టీ జిల్లా నాయకులు, నగర శాఖల నాయకులతో ఆయన సమావేశమై వచ్చే యేడాది జరుగనున్న అసెంబ్లీ ఎన్నికలకు అనుసరించాల్సిన వ్యూహాలపై చర్చలు జరిపారు. ఈ సమావేశం అనంతరం ఆయన మీడియా తో మాట్లాడుతూ ప్రభుత్వ, పార్టీ కార్యకలాపాల్లో పాల్గొనేందుకు కాంచీపురం వెళ్ళిన తనకు పార్టీ స్థానిక నాయకులు ఘన స్వాగతం పలికారని ఉదయనిధి తన ఎక్స్‌పేజీలో పేర్కొన్నారు. మాజీ ముఖ్యమంత్రి అన్నాదురై నివాసాన్ని సందర్శించడం తనకెంతో ఆనందాన్ని కలిగించిందని తెలిపారు.



అన్నాదురై నివాసంలో ఆయన విగ్రహానికి నివాళులర్పించిన ఉప ముఖ్యమంత్రి ఉదయనిధి

కూటమి విచ్ఛిన్నమే బీజేపీ లక్ష్యం

● టీఎన్‌సీసీ అధ్యక్షుడు సెల్వపెరుంతగై

పెరంబూర్, సెప్టెంబరు 9 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో బలంగా ఉన్న పార్టీతో కూటమి ఏర్పాటుచేసి, ఆ పార్టీని విచ్ఛిన్నం చేసి ఆ స్థానంలో తాను నిలవాలని బీజేపీ లక్ష్యమని తమిళనాడు కాంగ్రెస్ కమిటీ (టీఎన్‌సీసీ) అధ్యక్షులు సెల్వపెరుంతగై తెలిపారు. రాయపేటలోని పార్టీ కార్యాలయం సత్యమూర్తి భవన్‌లో ఆయన మాట్లాడుతూ.... మదురై విమానాశ్రయానికి ముత్తురాలింగ దేవన్ పేరు పెట్టాలని ఈపీఎస్ కోరడం హాస్యస్పదంగా ఉందన్నారు. పదేళ్ల అన్నాడీఎంకే పాలనలో ఈ విషయమై ఆయన ఎందుకు మాట్లాడలేదని, ఆయన నాలుగేళ్ల ముఖ్యమంత్రిగా పనిచేశారని, ఆ సమయంలో కూడా ఆయన ఎందుకు ఆలోచించలేదని ప్రశ్నించారు. ప్రస్తుతం తన పర్యటనలో ఏ ప్రాంతానికి వెళ్లినా, ఆ ప్రాంతాల పరిస్థితులపై పళనిస్వామి మాట్లాడుతున్నారన్నారు. అన్నాడీఎంకేలో జరుగుతున్న అంతర్గత సమస్య అయినా, అందులో ఓ యదార్థం మరిచిపోకూడదన్నారు. బీజేపీ ఎక్కడ కూటమి ఏర్పాటుచేసినా, ఆ పార్టీని విచ్ఛిన్నం చేయడమే వారి లక్ష్యమన్నారు. ఇందుకు మహారాష్ట్రంలో శివసేన ఉదాహరణ అన్నారు. ప్రస్తుతం అన్నాడీఎంకే ఈపీఎస్, ఓపీఎస్, శశికళ, టీటీవీ దినకరన్ ఇలా నాలుగు వర్గాలుగా విడిపోయిందని, తాజాగా సెంగోట్టయన్‌తో ఐదో వర్గం ఏర్పడిందన్నారు. పీఎంకేలో నెలకొన్న విభేదాలకు కూడా బీజేపీయే కారణమని సెల్వపెరుంతగై ఆరోపించారు.

టీవీకేతో బీజేపీ పొత్తుకు

'నో ఛాన్స్!'

● అన్నామలై



చెన్నై, సెప్టెంబరు 9 (ఆంధ్రజ్యోతి): సినీ నటుడు విజయ్ నాయకత్వంలోని తమిళగ వెట్రి కళగం (టీవీకే)తో తమ పార్టీ పొత్తు పెట్టుకునే అవకాశాలే లేవని బీజేపీ రాష్ట్ర మాజీ అధ్యక్షుడు అన్నామలై స్పష్టం చేశారు. పార్టీపరంగా రెండు మహానాడులు నిర్వహించి జనసమీకరణ చేసినంత మాత్రాన ఆ జనం టీవీకేకు ఓట్లు వేస్తారనే గ్యారెంటీ లేదని, జనాన్ని చూసి విజయ్ మోసపోకూడదన్నారు. ఓ ఆంగ్ల టీవీ ఛానెల్‌కు ఇచ్చిన ఇంటర్వ్యూలో సిద్ధాంతపరంగా బీజేపీ తమ పార్టీకి బద్ధ శత్రువు అని స్పష్టంగా విజయ్ ప్రకటించిన తర్వాత తామెలా ఆ పార్టీతో పొత్తుపెట్టుకోగలమని ఆయన ప్రశ్నించారు. ప్రస్తుతం డీఎంకే ప్రభుత్వానికి చరమగీతం పాడటమే ఎన్డీయే ప్రధాన లక్ష్యమని, ఆ దిశగానే అసెంబ్లీ ఎన్నికల్లోగా బలమైన కూటమిని ఏర్పాటు చేయనున్నామని చెప్పారు. ఏది ఏమైనప్పటికీ టీవీకేతో బీజేపీ పొత్తుపెట్టుకునే అవకాశాలు లేనేలేవని అన్నామలై స్పష్టం చేశారు.

అన్నాడీఎంకేలో సమస్యలకు డీఎంకే కారణం...

రాష్ట్రంలో అన్నాడీఎంకేలో జరుగుతున్న అన్ని సంఘటనలకు డీఎంకే కారణమని బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు నయినార్ నాగేంద్రన్ అన్నారు. అన్నాడీఎంకే సీనియర్ నేత సెంగోటయ్యన్ ఆ పార్టీ అధిష్టానంపై ఆగ్రహం వ్యక్తం చేయడం వెనుక డీఎంకే ప్రమేయం ఉందన్నారు. ఈ నెల 11న ఢిల్లీ వెళ్లి పార్టీ జాతీయ నాయకులను కలుసుకుని అసెంబ్లీ ఎన్నికల్లో అనుసరించాల్సిన వ్యూహాలపై చర్చలు జరుపుతానని చెప్పారు.

● సీమాన్‌పై లైంగిక వేధింపుల కేసు..

12న విచారించనున్న

సుప్రీంకోర్టు

చెన్నై, సెప్టెంబరు 9 (ఆంధ్రజ్యోతి): 'నామ్ తమిళర్ కట్చి' వ్యవస్థాపకులు, సినీ దర్శకుడు సీమాన్‌పై నటి విజయలక్ష్మి దాఖలుచేసిన లైంగిక వేధింపుల కేసు ఈ నెల 12న సుప్రీంకోర్టులో విచారణకు రానుంది. సీమాన్ తనను వివాహం చేసుకుంటానని నమ్మించి మోసం చేశాడని నటి విజయలక్ష్మి ఫిర్యాదు మేరకు కేసు నమోదుచేసిన పోలీసులు విచారణ చేపట్టారు. తనపై మోపిన కేసు రద్దు చేయాలని కోరుతూ సీమాన్ దాఖలుచేసిన పిటిషన్‌ను మద్రాసు హైకోర్టు తోసిపుచ్చింది. అంతేగాక పోలీసులు 12 వారాల్లో విచారణ పూర్తిచేయాలని ఆదేశించింది. దానిని వ్యతిరేకిస్తూ సీమాన్ దాఖలు చేసిన అప్పీలు పిటిషన్ మేలో విచారించిన సుప్రీంకోర్టు బాధితురాలికి పిటిషనర్ ఏం బదులిస్తారని ప్రశ్నిస్తూ.. 12 వారాల్లో విచారణ ముగించాలనే ఉత్తర్వులపై తాత్కాలిక స్టే విధించింది. ఈ పిటిషన్ మళ్లీ సుప్రీంకోర్టు న్యాయమూర్తి జస్టిస్ నాగరత్న నేతృత్వంలోని ధర్మాసనం విచారణ చేపట్టింది. అయితే ఈ కేసులో సీమాన్‌తో సెటిల్‌మెంట్‌కు సిద్ధంగా లేనని స్పష్టం చేసిన విజయలక్ష్మి.. కౌంటర్ దాఖలుకు అవకాశం ఇవ్వాలని కోరారు. ఆమె విజ్ఞప్తిని పరిగణనలోకి తీసుకున్న న్యాయస్థానం, కేసు విచారణ వాయిదావేసింది. మంగళవారం ఈ కేసు మళ్లీ విచారణకు రాగా, సీమాన్ తరఫున కౌంటర్ అఫిడవిట్ సమర్పించారు. అందులో, విజయలక్ష్మికి వ్యతిరేకంగా దాఖలుచేసిన కేసు చాలాకాలంగా పెండింగ్‌లో ఉందని, దానిని త్వరితగతిన విచారణ జరిపేలా ఉత్తర్వులివ్వాలని కోరారు. ఇరుతరపు వాదనల్ని పరిగణనలోకి తీసుకున్న ధర్మాసనం.. తదుపరి విచారణను ఈ నెల 12వ తేదీకి వాయిదావేసింది.

సమాచార దర్శిని

నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలు

పెరంబూర్, సెప్టెంబరు 9 (ఆంధ్రజ్యోతి): విద్యుత్ మార్గాల్లో మరమ్మతుల కారణంగా దిగువ ప్రాంతాల్లో బుధవారం ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగనుందని విద్యుత్ బోర్డు ఒక ప్రకటనలో తెలిపింది.

పారివాక్కం: అన్నైకాట్టుచేరి, అముతుర్ మేడు, తిరుమనం, కావల్‌చేరి, వాయలనల్లూర్, సోరన్‌చేరి, ఓలిచేరి, చిత్కాడు.

కొట్టూరుపురం: రంగరాజుపురం, సైదాపేట, శ్రీ నగర్ కాలని, ఎల్‌డీజీ రోడ్డు, వెంకటాపురం, వేళచ్చేరి మెయిన్ రోడ్డు, చిత్రా నగర్, రివర్ వ్యూ రోడ్డు, హౌసింగ్ బోర్డు

రైల్వే పోస్టులకు దరఖాస్తుల ఆహ్వానం

పెరంబూర్, సెప్టెంబరు 9 (ఆంధ్రజ్యోతి): రైల్వేలో ఖాళీ పోస్టులకు ఆసక్తి కలిగిన వారు దరఖాస్తు చేసుకోవచ్చు. రైల్వే శాఖలో నర్సు, వైద్యులు, రేడియోగ్రాఫర్, ఈసీజీ టెక్నీషియన్ సహా 434 పోస్టులు భర్తీ చేయనున్నారు. అభ్యర్థులు https://www.rrbapply.gov.in/#/auth/landing అనే వెబ్‌సైట్‌లో ఈ నెల 18వ తేదిలోపు దరఖాస్తు చేసుకోవచ్చని రైల్వే శాఖ తెలిపింది.

ఇంజనీరింగ్ విద్యార్థులకు సర్టిఫికెట్ కోర్సు

పెరంబూర్, సెప్టెంబరు 9 (ఆంధ్రజ్యోతి): స్థానిక గిండిలోని అన్నా విశ్వవిద్యాలయ పరిధిలోని మేథో సంపత్తి హక్కుల కేంద్రంలో ఇంజనీరింగ్‌విద్యార్థులకు వారం రోజుల సర్టిఫికెట్ శిక్షణ ఈ నెల 16 నుంచి 20వ తేది వరకు జరుగనుంది. శిక్షణలో చేరేందుకు ఆసక్తి ఉన్న విద్యార్థులు మేథో సంపత్తి హక్కుల కేంద్రం డైరెక్టర్‌ను సంప్రదించవచ్చు. వివరాలను www.annauniv.edu/ipr అనే వెబ్‌సైట్ ద్వారా తెలుసుకోవచ్చు.

హోమియోపతి కోర్సులకు దరఖాస్తుల ఆహ్వానం

పెరంబూర్, సెప్టెంబరు 9 (ఆంధ్రజ్యోతి): ప్రస్తుత విద్యా సంవత్సరం ఇండియన్ మెడిసిన్ అండ్ హోమియోపతి కోర్సుకు దరఖాస్తులు చేయవచ్చు. చెన్నై, పాళయంకోటలోని ప్రభుత్వ ఆయుష్ పారా మెడికల్ పాఠశాలలో 2025 - 26విద్యా సంవత్సరానికి డిప్లొమా కోర్సులో ప్రవేశానికి అర్హులైన వారు www.tnhealtn.tn.gov.in, www.tnayushselection.org అనే వెబ్‌సైట్ల నుంచి దరఖాస్తులు డౌన్‌లోడ్ చేసుకోవచ్చు. ఒరిజినల్ సర్టిఫికెట్ల అప్‌లోడ్ తదితరాలను వెబ్‌సైట్ల నుంచి పూర్తి సమాచారం సేకరించి అప్‌లోడ్ చేయాల్సి ఉంది. ట్యూషన్ ఫీజు ముందస్తు చెల్లింపులు ఆన్‌లైన్‌లో మాత్రమే స్వీకరిస్తారు. దరఖాస్తులను పోస్టు ద్వారా 'ఇండియన్ మెడిసిన్ అండ్ హోమియోపతి కమిషనర్ కార్యాలయం, అరింజర్ అన్నా గవర్నమెంట్ ఇండియన్ హాస్పిటల్ కాంప్లెక్స్, అరుంబాక్కం, చెన్నై-600106' అనే చిరునామాకు ఈ నెల 23వ తేది సాయంత్రం 5 గంటల్లోపు పంపించాలి.

13న మైలాపూరు అకాడమీ వజ్రోత్సవాలు

చెన్నై, సెప్టెంబరు 9 (ఆంధ్రజ్యోతి): నగరంలోని మైలాపూరు అకాడమీ వజ్రోత్సవాలు 13 నుంచి నిర్వహించనున్నట్లు ఆ సంస్థ నిర్వాహకులు తెలిపారు. భారతీయ విద్యాభవన్‌లో ఈ నెల 13 మధ్యాహ్నం 3 గంటలకు జరిగే ఈ వేడుకలలో ముఖ్య అతిథిగా మాజీ ఉపరాష్ట్రపతి ఎం.వెంకయ్యనాయుడు పాల్గొంటారని తెలిపారు. మైలాపూరు అకాడమీ అధ్యక్షుడు, హైకోర్టు మాజీ న్యాయమూర్తి జస్టిస్ ఎస్.జగదీశన్ సభకు అధ్యక్షత వహించనుండగా, యూ.కే. మాజీ రాయబారి టీ.ఎస్. తిరుమూర్తి విశిష్ట అతిథిగా పాల్గొననున్నారు.

సప్తగిరి ఎక్స్‌ప్రెస్‌కు ఎల్‌హెచ్‌బీ బోగీలు

పెరంబూర్, సెప్టెంబరు 9 (ఆంధ్రజ్యోతి): చెన్నై సెంట్రల్-తిరుపతి మధ్య నడుపుతున్న సప్తగిరి ఎక్స్‌ప్రెస్ రైళ్లకు ఎల్‌హెచ్‌బీ బోగీలను అనుసంధానం చేయనున్నారు. ఆ ప్రకారం, నెం.16053/16054 చెన్నై సెంట్రల్-తిరుపతి- చెన్నై సెంట్రల్, నెం.16057/16058 చెన్నై సెంట్రల్-తిరుపతి- చెన్నై సెంట్రల్ సప్తగిరి ఎక్స్‌ప్రెస్ రైళ్లకు ఈ నెల 20 నుంచి ఎల్‌హెచ్‌బీ బోగీలు అనుసంధానం చేయనున్నట్లు దక్షిణ రైల్వే ఒక ప్రకటనలో తెలిపింది.

అన్నా వర్సిటీ మాజీ వీసీ డిస్మిస్ రద్దు

● గవర్నర్ ఉత్తర్వులు

పెరంబూర్, సెప్టెంబరు 9(ఆంధ్రజ్యోతి): అన్నా విశ్వవిద్యాలయం మాజీ ఉపకులపతి ఆర్.వేల్‌రాజ్‌ను డిస్మిస్ చేస్తూ జారీచేసిన ఉత్తర్వులను విశ్వవిద్యాలయ కులపతి, గవర్నర్ ఆర్ఎన్ రవి రద్దు చేశారు. ఒకే ప్రొఫెసర్ పలు ఇంజనీరింగ్ కళాశాలల్లో పనిచేస్తున్నారనే ఆరోపణలు తలెత్తాయి. ఆ సమయంలో ఉపకులపతిగా వ్యవహరించిన వేల్‌రాజ్, ఈ మోసాన్ని సకాలంలో, సక్రమంగా పర్యవేక్షించలేదంటూ, విశ్వవిద్యాలయం సిండికేట్ కమిటీ సిఫారసులతో, పదవీవిరమణ రోజున ఆయనను డిస్మిస్ చేశారు. ఈ వ్యహారంలో రాష్ట్ర అవినీతి నిరోధక, నిఘా విభాగం విచారణ చేపట్టాలని సిండికేట్ కమిటీ గవర్నర్‌కు సిఫారసు చేసింది. ఈ నేపథ్యంలో, డిస్మిస్ ఉత్తర్వులు వ్యతిరేకిస్తూ వేల్‌రాజ్ గవర్నర్‌కు అప్పీలు చేసుకున్నారు. అందులో ఆయన సమర్పించిన ఆధారాలు పరిశీలించిన గవర్నర్ మాజీ ఉపకులపతి వేల్‌రాజ్ డిస్మిస్ ఉత్తర్వులు రద్దు చేస్తూ ఈ నెల 5వ తేది ఉత్తర్వులు జారీచేశారు.

పోలీసుల రక్తదానం

పెరంబూర్, సెప్టెంబరు 9 (ఆంధ్రజ్యోతి): గ్రేటర్ చెన్నై పోలీసుశాఖ ఆధ్వర్యంలో రాష్ట్ర తొలి పోలీసు దినోత్సవం ఈ నెల 6న నిర్వహించారు. పది రోజులు ఈ దినోత్సవాలు నిర్వహించాలని నిర్ణయించి, ప్రతిరోజు నేరాలు, సైబర్ నేరాలు, మాదక ద్రవ్యాల అనర్థాలు, ట్రాఫిక్ నిబంధనలు తదితరాలపై అవగాహన కల్పిస్తున్నారు. ఈ కార్యక్రమంలో భాగంగా మంగళవారం పుదుపేట సాయుధదళం అసిస్టెంట్ కమిషనర్ కార్యాలయ ప్రాంగణంలోని సమావేశ మందిరంలో రక్తదాన శిబిరం నిర్వహించారు. ఈ శిబిరంలో పోలీసులు, వారి కుటుంబాలకు చెందిన 200 మంది రక్తదానం చేసినట్లు నగర పోలీసు శాఖ ఒక ప్రకటనలో తెలిపింది.


రక్తదానం చేస్తున్న పోలీసులు

మృత్యువులోనూ వీడని బంధం

● భర్త మృతిని తట్టుకోలేక ప్రాణాలు విడిచిన భార్య

చెన్నై, సెప్టెంబరు 9 (ఆంధ్రజ్యోతి): కోయంబత్తూరు జిల్లా సూలూరు సమీపంలో భర్త ఆకస్మిక మృతిని తట్టుకోలేక భార్య కూడా ప్రాణాలు విడిచిన సంఘటన స్థానికుల కంటతడిపెట్టించింది. తిరునల్వేలి జిల్లా విక్రమసింగపురం ప్రాంతంలో మాడసామి (80), వీరమ్మాళ్ (75) అనే దంపతులు నివసిస్తున్నారు. వీరికి ఇద్దరు కుమారులు, ఇద్దరు కుమార్తెలున్నారు. ఇటీవల మాడసామి వృద్ధాప్య సమస్యలతో తీవ్ర అస్వస్థతకు గురై చికిత్స కోసం కోయంబత్తూరు సమీపం సూలులో ఉన్న కుమార్తె సూర్యా చిత్తిరై కన్నన్ ఇంటికి వెళ్లారు. ఆయనతోపాటు వీరమ్మాళ్ కూడా వెళ్లారు. కుమార్తె ఇంటిలోనే ఉంటూ మాడసామి కోవై ఆస్పత్రుల్లో చికిత్స చేయించుకున్నారు. ఈ నేపథ్యంలో ఆదివారం సాయంత్రం మాడసామి మృతి చెందగా, సోమవారం ఉదయం ఆయన అంత్యక్రియలు జరిగాయి. అదే సమయంలో భర్త మృతిని తట్టుకోలేక వీరమ్మాళ్ తీవ్ర అస్వస్థతకు గురై సోమవారం సాయంత్రం గుండెపోటు రావటంతో సొమ్మసిల్లిపడింది. వెంటనే కుటుంబీకులు ఆమెను చికిత్స కోసం ప్రైవేటు ఆస్పత్రికి తరలించగా, ఆసుపత్రిలోనే వీరమ్మాళ్ తుదిశ్వాస విడిచింది. దీనితో ఆమె అంత్యక్రియలు సోమవారం రాత్రి జరిగాయి. ఇలా రెండు రోజుల వ్యవధిలో వృద్ధదంపతులు ప్రాణాలు కోల్పోవడం సూలురు వాసులకు కంటతడిపెట్టించింది.

మహిళలపై లైంగిక వేధింపులు

● కరాటే మాస్టర్ అరెస్టు


కరాటే మాస్టర్ అబ్దుల్ వహాబ్

చెన్నై, సెప్టెంబరు 9 (ఆంధ్రజ్యోతి): తిరునల్వేలి జిల్లాలో కరాటే, రైఫిల్ షూటింగ్‌లో శిక్షణ పొందటానికి వచ్చే విద్యార్థుల తల్లులపై లైంగిక వేధింపులకు పాల్పడిన కరాటే మాస్టార్ అబ్దుల్ వహాబ్ (37) పోలీసులు అరెస్టు చేశారు. తిరునల్వేలిలో అబ్దుల్‌వహాబ్ రైఫిల్ షూటింగ్ శిక్షణా కేంద్రం నడుపుతున్నాడు. షూటింగ్ కోసం ఆ కేంద్రానికి తమ పిల్లలను తీసుకెళ్లే మహిళలపై అబ్దుల్ వహాబ్ అసభ్యంగా ప్రవర్తించేవాడనే ఆరోపణలు వచ్చాయి. ఈ క్రమంలో ఓ వివాహితతో పరిచయం ఏర్పరచుకుని ఆమెపై లైంగిక వేధింపులకు పాల్పడ్డాడు. కొద్ది రోజులుగా ఆమె తన పిల్లలను శిక్షణా కేంద్రానికి తీసుకెళ్లకపోవడంతో అబ్దుల్ వహాబ్ ఆమె ఇంటి వద్దకే వెళ్లి గొడవపడ్డాడు. ఆ మహిళ కేకలు పెట్టడంతో చుటుపక్కల వారు రావడంతో ఆయన పారిపోయాడు. బాధితురాలి ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకుని, అబ్దుల్ వహాబ్‌ను అరెస్టు చేశారు.

ఇరువర్గాలను రెచ్చగొట్టేలా వీడియో పోస్ట్

● ఇద్దరి అరెస్ట్

చెన్నై, సెప్టెంబరు 9(ఆంధ్రజ్యోతి): ఇరువర్గాల మధ్య ఘర్షణలు రేకెత్తించేలా సామాజిక మాధ్యమాల్లో వీడియో పోస్ట్ చేసిన వ్యవహారంలో ఇద్దరిని పోలీసులు అరెస్ట్ చేశారు. తిరునల్వేలి జిల్లా పత్తిని పారై అమ్మన్ ఆలయవీధికి చెందిన నంద (19), సెర్మందురై (32) ఇరువర్గాల వారిని రెచ్చగొట్టేలా సామాజికమాధ్యమాల్లో వీడియో పోస్ట్ చేశారనే ఆరోపణలున్నాయి. ఈ వ్యవహారంపై విచారణ చేపట్టిన పోలీసులు, నంద, సెర్మందురైలను అరెస్టుచేశారు. ఇలాంటి వీడియోలు పోస్టుచేసే వారిపై కఠినచర్యలు చేపడతామని ఎస్పీ సిలంబరసన్ హెచ్చరించారు.

ఏడు నెలల్లో రూ.1,010 కోట్ల సైబర్ దోపిడీ

పెరంబూర్, సెప్టెంబరు 9 (ఆంధ్రజ్యోతి): ఈ ఏడాది జనవరి నుంచి జూలై వరకు సైబర్ మోసాలతో రూ.1,010 కోట్లు ప్రజలు కోల్పోయారని సైబర్ క్రైం పోలీసులు తెలిపారు. సైబర్ నేరాలపై ఏడు నెలల్లో 88,479 ఫిర్యాదులందాయని తెలిపింది. ప్రజలు కోల్పోయిన నగదులో రూ.314 కోట్లు స్తంభింపజేయగా, రూ.62 కోట్లు బాధితులకు అందజేసినట్లు సైబర్ క్రైం విభాగం తెలిపింది. రుణాల ఇస్తామని సెల్‌ఫోన్లకు వచ్చే లింక్‌లను ప్రజలు క్లిక్ చేయరాదని, ఒకవేళ నగదు కోల్పోయిన వెంటనే సత్వరం సైబర్ క్రైంకు సమాచారం అందించాలని పోలీసులు సూచించారు.

ఏనుగు దాడిలో ఒకరి మృతి

పెరంబూర్, సెప్టెంబరు 9 (ఆంధ్రజ్యోతి): నీలగిరి జిల్లాలో ఏనుగు దాడిలో ఒకరు మృతిచెందగా, మరొకరికి గాయాలయ్యాయి. మెహబూబ్ (38), తన స్నేహితుడితో కలసి సోమవారం బైక్‌పై బయల్దేరాడు. కూడలూరు జిల్లా ఓవెలి మార్గంగా బైక్ వస్తున్న సమయంలో, హఠాత్తుగా పొదల చాటు నుంచి వచ్చిన ఏనుగును చూసి సడన్ బ్రేక్ వేయంతో ఇద్దరు కింద పడ్డారు. వారిలో మెహబూబ్‌ను ఏనుగు తొండంతో చుట్టి విసిరేయడంతో ఘటనా స్థలంలోనే మృతిచెందాడు. కొందరు వాహన చోదకులు ఆ ప్రాంతానికి చేరుకుని, గాయపడిన వ్యక్తి ని ఆస్పత్రికి తరలించారు. ఈ ఘటనపై అటవీ శాఖ అధికారులు విచారణ చేపట్టారు.

ఈషా సెంటర్‌కు వ్యతిరేకంగా దాఖలైన పిటిషన్ కొట్టివేత

చెన్నై, సెప్టెంబరు 9 (ఆంధ్రజ్యోతి): ఈషా సెంటర్‌కు వ్యతిరేకంగా దాఖలైన పిటిషన్‌ను మద్రాసు హైకోర్టు కొట్టివేసింది. కోయంబత్తూర్ ఈషా సెంటర్‌లో వ్యర్థజలాల శుద్ధికి ఏర్పాట్లు చేయకుండా ఉత్సవాలు నిర్వహించడంపై నిషేధం విధించాలని కోరుతూ హైకోర్టులో ఓ పిటిషన్ దాఖలైంది. ఈ కేంద్రం నుంచి విడుదలయ్యే మురుగునీటి వల్ల తన వ్యవసాయ భూమితో పాటు భూగర్భ జలాలు కూడా కలుషితం అవుతున్నాయని శివజ్ఞానం అనే వ్యక్తి పిటిషన్ వేశారు. ఈషా సెంటర్‌లో మురుగునీటి శుద్ధీకరణ కర్మాగారం ఉందని, శబ్దస్థాయి కూడా అనుమతించిన స్థాయిలోనే ఉందని ఈషా సెంటర్ తరఫున కోర్టుకు వివరించింది. ఈషా సెంటర్ వాదన పరిగణలోకి తీసుకున్న న్యాయస్థానం, పిటిషన్ కొట్టివేస్తూ ఉత్తర్వులు జారీచేసింది.

అద్దాల వంతెనపై వదంతులు నమ్మొద్దు

పెరంబూర్, సెప్టెంబరు 9 (ఆంధ్రజ్యోతి): అద్దాల వంతెనలో పగుళ్లు ఏర్పడ్డాయనే వదంతులు నమ్మవద్దని, వంతెన బలంగా ఉందని జిల్లా కలెక్టర్ అళగుమీన తెలిపారు. కన్నియాకుమారి సముద్ర మధ్యలోని వివేకానంద స్మారక మండపం-తిరువళ్లూర్ మధ్య అద్దాల వంతెన ఏర్పాటు చేశారు. వంతెన అద్దాల్లో పగుళ్లు ఏర్పడినట్లు వార్తలు వెలువడ్డాయి. ఈ విషయమై జిల్లా కలెక్టర్ విడుదల చేసిన ప్రకటనలో... అద్దాల వంతెనను ఇప్పటికరకు సుమారు 17.50 లక్షల మంది వినియోగించారన్నారు. వంతెన నిర్వహణ సమయంలో, ఒక ఉద్యోగి చేతిలోని సుత్తి కిందపడడంతో, అద్దాలకు చిన్న పగుళ్లు ఏర్పడ్డాయని, పగుళ్లకు మరమ్మతు చేపట్టినట్లు, అద్దాల వంతెన బలంగా ఉందని కలెక్టర్ తెలిపారు.

ఏడడుగులు నడిచి....

వారం రోజులకే నవ వధువు పరార్

● ప్రియుడితో కలిసి పోలీస్ స్టేషన్‌లో ప్రత్యక్షం

చెన్నై, సెప్టెంబరు 9 (ఆంధ్రజ్యోతి): వందవాసి సమీపంలో వివాహమైన కొద్దిరోజులకే ఇంటి వెళ్లిపోయిన నవవధువు, ప్రియుడితో కలసి పోలీస్ స్టేషన్‌లో శరణు కోరడం కలకలం రేపింది. తిరువణ్ణామలై జిల్లా తెన్‌ఎల్పాక్కం గ్రామానికి చెందిన యువశ్రీ (19)కి కాంచీపురం జిల్లా ఉత్తరమేరూరు తాలూకాకు చెందిన ఓ యువకుడితో గత నెల 29వ తేది పెద్దల సమక్షంలో వివాహం జరిగింది. వివాహం అనంతరం అత్తగారింటికి వెళ్లిన యువశ్రీ, భర్తతో కలసి ఈ నెల 6వ తేది తెన్‌ఎల్పాక్కం చేరుకుంది. మరుసటిరోజు యువశ్రీ ఇంటి నుంచి వెళ్లి తిరిగిరాలేదు. దీంతో, భర్త, కుటుంబ సభ్యులు ఆమె కోసం గాలించారు. చివరకు యువశ్రీ తండ్రి వందవాసి ఉత్తరం పోలీసుస్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. కేసు నమోదుచేసిన పోలీసులు ఆమె ఆచూకీ కోసం గాలించారు. యువశ్రీ వివాహానికి ముందు చెన్నైలోని ఓ కంపెనీలో పనిచేసిందని, ఆ సమయంలో అదే కంపెనీలో పనిచేస్తున్న కాంచీపురం జిల్లాకు చెందిన శేషాద్రితో ఏర్పడిన పరిచయం ప్రేమగా మారిందని తెలిసింది. దీంతో, పోలీసులు సెవిలిమేడు వెళ్లగా అక్కడ శేషాద్రి కనిపించలేదు. దీంతో, అతడికి ఫోన్ చేసిన పోలీసులు, యువశ్రీని తమకు అప్పగించాలని, లేకపోతే చట్టపరమైన చర్యలు చేపట్టాల్సి వస్తుందని హెచ్చరించారు. ఈ నేపథ్యంలో, సోమవారం యువశ్రీ తన ప్రియుడితో కలసి పోలీస్ స్టేషన్‌కు రాగా, పోలీసులు ఆమెను విచారించారు. భర్తతో వెళ్లేందుకు నిరాకరించిన ఆమె, ప్రియుడితోనే ఉంటానంటూ తేల్చి చెప్పింది. యువశ్రీ మేజర్ కావడంతో తాము ఏమీ చేయలేమని స్పష్టం చేసిన పోలీసులు ప్రియుడితో ఆమెను పంపించారు.

న్యాయవాదులపై దాడిని విచారిస్తున్న ఏకసభ్య కమిషన్ రద్దు

చెన్నై, సెప్టెంబరు 9 (ఆంధ్రజ్యోతి): పారిశుధ్య కార్మికులు ఆందోళన చేస్తున్న సమయంలో అరెస్ట్ చేసిన న్యాయవాదులపై పోలీసులు దాడిచేశారన్న వ్యవహారం విచారణకు నియమించిన ఏకసభ్య కమిషన్‌ను మద్రాసు హైకోర్టు రద్దు చేసింది. తొలుత పారిశుధ్య కార్మికులు చేపట్టిన ఆందోళనలకు న్యాయవాదులు, లా కళాశాల విద్యార్థులు మద్దతు తెలుపగా, వారిని పోలీసులు అరెస్ట్ చేసి, దాడి చేశారనే ఆరోపణలున్నాయి. ఈ వ్యవహారంపై మద్రాసు హైకోర్టులో హెబియస్ కార్పస్ పిటిషన్ దాఖలైంది. ఈ పిటిషన్ విచారించిన న్యాయమూర్తులు ఎస్ఎం రమేష్, వి.లక్ష్మీ నారాయణన్‌లతో కూడిన డివిజన్ బెంచ్, పారిశుధ్య కార్మికుల ఆందోళనకు మద్దతు తెలిపిన న్యాయవాదులను అరెస్ట్ చేసి, వారిపై దాడికి పాల్పడ్డారన్న ఆరోపణల విచారణకు హైకోర్టు మాజీ న్యాయమూర్తి వి.పార్తీబన్ నేతృత్వంలో ఏకసభ్య కమిషన్ ఏర్పాటుచేస్తూ ఉత్తర్వులు జారీచేసింది. అలాగే, కమిషన్ సత్వరం విచారణ పూర్తిచేసి నివేదిక దాఖలుచేయాలని ఉత్తర్వుల్లో పేర్కొన్నారు. ఈ క్రమంలో, ఏకసభ్య కమిషన్ ఉత్తర్వులు రద్దు చేయాలంటూ నగర పోలీసు కమిషనర్, పెరియమేడు పోలీస్ స్టేషన్ ఇన్‌స్పెక్టర్ పిటిషన్ వేశారు. ఈ పిటిషన్ విచారించిన హైకోర్టు న్యాయమూర్తులు నిషాభాను, సౌందర్‌లతో కూడిన ధర్మాసనం ఏక సభ్య విచారణ కమిషన్ ఉత్తర్వులు రద్దు చేస్తూ ఉత్తర్వులు జారీచేశారు.

డీఎస్పీ శంకర్‌గణేష్‌ను విడుదల చేయండి

● మద్రాస్ హైకోర్టు ఉత్తర్వులు

ప్యారీస్, సెప్టెంబరు 9 (ఆంధ్రజ్యోతి): దాడి కేసులో ముద్దాయిలను అరెస్టు చేయకుండా నిర్లక్ష్యంగా వ్యవహరించి అరెస్టయిన కాంచీపురం డీఎస్పీ శంకర్‌గణేష్‌ను విడుదల చేయాలని మద్రాస్ హైకోర్టు ఆదేశించింది. కాంచీపురం జిల్లా వాలాజాబాద్ సమీపంలోని పూసివాక్కం ప్రాంతంలో వున్న ఓ బేకరీలో జరిగిన దాడి కేసు ఫిర్యాదుపై తగిన చర్యలు చేపట్టని కారణంగా డీఎస్పీ శంకర్ గణేష్‌ను ఎస్సీ ఎస్టీ చట్టం కింద అరెస్ట్ చేయాలని కాంచీపురం జిల్లా సెషన్స్ కోర్టు న్యాయమూర్తి సెమ్మల్ సోమవారం ఉత్తర్వులు జారీచేయడం పోలీసు వర్గాలను ఆందోళనకు గురిచేసింది. ఈ నెల 22వ తేది వరకు రిమాండ్ విధించడంతో, డీఎస్పీ శంకర్ గణేష్‌ను పోలీసులు అరెస్ట్ చేశారు. డీఎస్పీని విడుదల చేయాలని కోరుతూ ఓ న్యాయవాది హైకోర్టులో దాఖలు చేసిన పిటిషన్ మంగళవారం విచారణకు వచ్చింది. ఇరు తరఫు న్యాయవాదుల వాదనలు విన్న న్యాయస్థానం డీఎస్పీ శంకర్‌గణేష్‌ను విడుదల చేయాలని ఆదేశించింది.

ఎన్నికల సంఘానికి వ్యతిరేకంగా పిటిషన్

● రూ. లక్ష జరిమానాతో తోసివేత

పెరంబూర్, సెప్టెంబరు 9 (ఆంధ్రజ్యోతి): ఓటర్ల జాబితాలో మోసాలకు సంబంధించి ఎన్నికల సంఘానికి వ్యతిరేకంగా దాఖలైన పిటిషన్‌పై విచారణ జరిపిన హైకోర్టు పిటిషనర్‌కు రూ. లక్ష జరిమానా విధిస్తూ పిటిషన్ తోసిపుచ్చింది. కోడంబాక్కంకు చెందిన న్యాయవాది వెంకటశివకుమార్, ఓటరు జాబితాలో అక్రమాలు జరిగాయని మద్రాసు హైకోర్టులో ప్రజావ్యాజ్యం దాఖలుచేశారు. పిటిషన్‌లో.. 2024లో జరిగిన పార్లమెంటు ఎన్నికల్లో ఓటరు జాబితాలో మోసాలున్నాయని పార్లమెంటు ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ ఆరోపించారని తెలిపారు. ఓటరు జాబితాలో నకిలీ ఓటర్లు, ఒకే చిరునామాలో అధికంగా ఓటర్ల సహా పలు మోసాలు జరిగాయని ఆరోపించినా, ఎన్నికల సంఘం తగిన సమాధానం ఇవ్వకపోగా, రాహుల్ గాంధీని బెదిరించేలా నోటీసు పంపించారని తెలిపారు. న్యాయస్థానం జోక్యం చేసుకుని, ఓటరు జాబితాలో నెలకొన్న మోసాలపై స్పందించేలా ఎన్నికల సంఘానికి ఆదేశించాలని పిటిషన్‌లో కోరారు. ఈ పిటిషన్ ప్రధాన న్యాయమూర్తి ఎంఎం శ్రీవాస్తవ, న్యాయమూర్తి జి.అరుళ్‌మురుగన్ నేతృత్వంలోని ధర్మాసనం మంగళవారం విచారించి, ప్రకటనల కోసమే ఈ పిటిషన్ దాఖలుచేయారని వ్యాఖ్యానిస్తూ, పిటిషనర్‌కు రూ. లక్ష జరిమానా విధించి, పిటిషన్ తోసిపుచ్చుతున్నట్లు ఉత్తర్వులు జారీచేశారు.

12న పింఛన్ పథకంపై అభిప్రాయ సేకరణ

పెరంబూర్, సెప్టెంబరు 9 (ఆంధ్రజ్యోతిద): కేంద్ర ప్రభుత్వ ఉత్తర్వులమేరకు, రాష్ట్ర ప్రభుత్వం కాంట్రిబ్యూటరీ పెన్షన్ పథకం అమలుచేస్తోంది. ఈ క్రమంలో, కేంద్ర ప్రభుత్వం ఇంటిగ్రేటెడ్ పెన్షన్ పథకం అమలుచేయాలని నిర్ణయించింది. ఈ పథకంపై ప్రభుత్వ ఉద్యోగులు, ఉపాధ్యాయ సంఘాల అభిప్రాయాలు సేకరిస్తున్నారు. ఇందుకోసం గ్రామీణాభివృద్ధి శాఖ కార్యదర్శి గగన్‌దీప్‌సింగ్ బేదీ నేతృత్వంలో కమిటీ ఏర్పాటైంది. ఈ కమిటీ ఐదో అభిప్రాయ సేకరణ సమావేశం సోమవారం ముగిసిన నేపథ్యంలో, తదుపరి, చివరి సమావేశం ఈనెల 12న సచివాలయంలో జరుగుతుందని అధికారులు తెలిపారు.

విద్యుత్ స్తంభాల కొనుగోలుకు రూ.23.18 కోట్లు

పెరంబూర్, సెప్టెంబరు 9 (ఆంధ్రజ్యోతి): చెన్నై, వేలూరు, కోయంబత్తూర్ తదితర మండలాలకు 47,800 విద్యుత్ స్తంభాల కొనుగోలుకు రూ.23.18 కోట్లు కేటాయించినట్లు అధికారులు తెలిపారు. రాష్ట్రంలో వర్షాలు, ఎండల కారణంగా కాంక్రీట్ విద్యుత్ స్తంభాలు దెబ్బతింటున్నాయి. రాష్ట్రవ్యాప్తంగా లక్షలాది విద్యుత్ స్తంభాలు వినియోగంలో ఉన్నాయి. స్తంభాలపై బరువైన వస్తువులు వేయడం, టెంట్లు ఏర్పాటుచేయడం, పక్కన చెత్త వేస్తుండడంతో పలు స్తంభాలు దెబ్బతింటున్నాయి. టెండరు విధానం ద్వారా కొత్త సంభాల కొనుగోళ్లు చేపడుతుంటారు. అలాగే, స్తంభాలను ప్రాంతీయ స్థాయిలో విద్యుత్ బోర్డు వర్క్ షాప్‌లో తయారు చేసేవారు. ప్రస్తుతం వర్క్ షాపులు మూసివేస్తుండడంతో పొరుగు ప్రాంతాల నుంచి స్తంభాలు కొనుగోలు చేస్తున్నారు. ప్రస్తుతం రాష్ట్రవ్యాప్తంగా లక్ష స్తంభాలు శిథిలావస్థలకు చేరుకున్నట్లు పరిశీలనలో తెలిసింది. తొలివిడతగా, అత్యవసరంగా విద్యుత్ స్తంభాల కోసం రూ.23.18 కోట్లు కేటాయించారు. టెండర్ ప్రక్రియ పూర్తిచేసి 180 రోజుల్లో విద్యుత్ స్తంభాలు కొనుగోలు చేయాలని నిర్ణయించినట్లు అధికారులు తెలిపారు.

తిరుప్పూరులో హమాలీల ధర్నా


తిరుప్పూరులో ధర్నా చేస్తున్న కార్మికులు

చెన్నై, సెప్టెంబరు 9 (ఆంధ్రజ్యోతి): తిరుప్పూరు బ్రిడ్జ్‌వే కాలనీలో లారీ సంస్థల్లో మూటలు మోసే కార్మికులు కొందరిని పనిలోంచి తొలగించి ఉత్తరాదికి కార్మికులను నియమించుకోవడాన్ని ఖండిస్తూ కార్మికులు మంగళవారం ధర్నాకు దిగారు. తిరుప్పూరులో తయారయ్యే బనియన్లు, అల్లిక వస్తువులను వివిధ ప్రాంతాలకు లారీల్లో తరలిస్తుంటారు. ఆ లారీలలో సరకులు లోడింగ్, అన్‌లోడింగ్ చేయడానికి గోదాముల వద్ద వేల సంఖ్యలో కార్మికులు పనిచేస్తున్నారు. ఆ నేపథ్యంలో ఓ గోదాములో పనిచేసే కార్మికులు 17 మందిని తొలగించి, వారికి బదులుగా ఉత్తరాదికి చెందిన కార్మికులను నియమించారు. దీనిని ఖండిస్తూ మూటలు మోసే కార్మికులు ధర్నా నిర్వహించారు. ఈ నేపథ్యంలో బుధవారం కార్మికులకు, గోదాము నిర్వాహకుల నడుమ చర్చలు జరుగనున్నాయని సీఐటీయూ, ఏఐటీయూసీ సంఘాలకు చెందిన నేతలు తెలిపారు.

పారిశుధ్య కార్మికుల నిరాహారదీక్ష

చెన్నై, సెప్టెంబరు 9 (ఆంధ్రజ్యోతి): స్థానిక కొరుక్కుపేట ఇందిరానగర్ వద్ద సోమవారం తమ ఇళ్ల వద్ద నిరాహార దీక్షకు దిగి అరెస్టయిన కార్పొరేషన్ మహిళా పారిశుధ్య కార్మికులు మళ్లీ ఆందోళనకు దిగారు. ఇటీవల గ్రేటర్ చెన్నై కార్పొరేషన్ 5, 6 జోన్‌లకు చెందిన పారిశుధ్య కార్మికులు రిప్పన్ భవనం ఎదుట రిలే నిరాహార దీక్షలు, ధర్నాలు జరిపిన విషయం తెలిసిందే. కొరుక్కుపేట ఇందిరా నగర్‌లో నివసిస్తున్న 13 మంది మహిళా కార్మికులు నిరాహార దీక్షకు పూనుకున్నారు. పోలీసులు జోక్యం చేసుకుని అందరినీ అరెస్టు చేశారు. కాగా మంగళవారం ఉదయం చెన్నై సెంట్రల్ అల్లికుళం ప్రాంతం వద్ద 13 మంది మహిళా పారిశుధ్య కార్మికులు నిరాహార దీక్ష ప్రారంభించారు. పోలీసులు జోక్యం చేసుకుని వీరిని అరెస్టు చేశారు. ఈ సందర్భంగా మహిళా కార్మికులు మీడియాతో మాట్లాడుతూ పారిశుధ్యపనుల ప్రైవేటీకరణను వ్యతిరేకిస్తూ తాము చేస్తున్న ఆందోళనకు పోలీసులు ఎన్ని అడ్డంకులు కలిగించినా పట్టించుకోబోమని, జైలుకు తరలించినా అక్కడ కూడా తాము నిరాహార దీక్ష చేస్తామని హెచ్చరించారు.


అల్లికుళం వద్ద నిరాహార దీక్ష చేస్తున్న మహిళా కార్మికులు

దివ్యాంగులకు గుర్తింపు కార్డులు


దివ్యాంగులకు గుర్తింపు కార్డులను అందజేస్తున్న కలెక్టర్ సుబ్బులక్ష్మి

వేలూరు, సెప్టెంబరు 9(ఆంధ్రజ్యోతి): వేలూరు ప్రభుత్వ వైద్యకళాశాలలో మంగళవారం రాష్ట్ర దివ్యాంగుల సంక్షేమశాఖ ఆధ్వర్యంలో ప్రత్యేక శిబిరం జరిగింది. ముఖ్య అతిథిగా వేలూరు జిల్లా కలెక్టర్ సుబ్బులక్ష్మి పాల్గొని ప్రసంగించారు.. అనంతరం వైద్యకళాశాల నిర్వాహకులతో కలిసి కలెక్టర్ దివ్యాంగులకు గుర్తింపు కార్డులను అందజేశారు. ఈ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ రోహిణిదేవి సహా పలువురు డాక్టర్లు, దివ్యాంగుల సంక్షేమశాఖ అధికారులు పాల్గొన్నారు.

తిరుత్తణి ఆలయ సిబ్బందికి విందు


విందులో పాల్గొన్న ఆలయ నిర్వాహకులు

తిరుత్తణి, సెప్టెంబరు 9 (ఆంధ్రజ్యోతి): తిరువళ్లూరు జిల్లా తిరుత్తణి మురుగన్ ఆలయ అధికారులు, సిబ్బందికి మంగళవారం శాఖాహార విందు కార్యక్రమం జరిగింది. ఆలయంలో పలు ఉత్సవాలు విజయవంతంగా నిర్వహించడంలో కీలక పాత్ర పోషించిన ఉద్యోగులు, పారిశుధ్య కార్మికులు, ఎగ్జిక్యూటివ్ మెంబర్స్ సహా పలుశాఖల సిబ్బందికి మంగళవారం మధ్యాహ్నం విందు కార్యక్రమం ప్రారంభించారు. అనంతరం ఆలయ కమిషనర్ రమణి, చైర్మన్ శ్రీధరన్, ట్రస్టీలు వారందరినీ ఘనంగా సత్కరించారు.

రిటైర్డ్ ఉద్యోగి ఇంట్లో చోరీ

ప్యారీస్, సెప్టెంబరు 9 (ఆంధ్రజ్యోతి): తంజావూరు సమీపంలోని పాపానాడు ప్రాంతంలో రిటైర్డ్ ప్రభుత్వ బస్సు డ్రైవర్ ఇంట్లో చొరబడిన గుర్తుతెలియని వ్యక్తులు రూ.కోటి విలువచేసే నగలు దోచుకున్నారని పోలీసులు తెలిపారు. పాపానాడు గ్రామానికి చెందిన కన్నన్ ప్రభుత్వ రవాణాశాఖలో డ్రైవర్‌గా పనిచేసి ఇటీవల పదవీవిరమణ పొందారు. సోమవారం మధ్యాహ్నం ఇంటికి తాళం వేసి కన్నన్ కుటుంబ సభ్యులు బయటికి వెళ్లిన సమయంలో ఆ ఇంట్లో ప్రవేశించిన గుర్తుతెలియని వ్యక్తులు నగలు, వెండి పాత్రలు దోచుకుని కారులో తప్పించుకున్నట్లు పోలీసులు ఆ ప్రాంతాల్లో ఉన్న సీసీ ఫుటేజీ పరిశీలించి గుర్తించారు. దీనిపై కేసు నమోదు చేసి పరారైన దొంగల కోసం గాలింపు చర్యలు చేపట్టారు.

50యేళ్ల తర్వాత దళితులకు ఆలయ ప్రవేశం

ప్యారీస్, సెప్టెంబరు 9(ఆంధ్రజ్యోతి): కళ్లకురిచ్చి సమీపంలో 50యేళ్ల తర్వాత దళితులు ఆలయంలో ప్రవేశించి పూజల్లో పాల్గొన్నారు. కళ్లకురిచ్చి సమీపంలోని అనక్కరై కొటాళంలో సుమారు 500లకు పైగా దళిత కుటుంబాలున్నాయి. ఈ కుటుంబాలు ఆ గ్రామంలో ఉన్న అయ్యనార్ ఆలయంలో పూజలు నిర్వహించేందుకు మరో వర్గంవారు వ్యతిరేకించడంతో ఇరువర్గాల మధ్య ఘర్షణలు జరిగాయని చెబుతున్నారు. 50యేళ్లుగా ఒక వర్గంవారు తమను ఆలయంలోకి ప్రవేశించకుండా అడ్డుకుంటున్నారంటూ దళిత వర్గాలకు చెందిన కొంతమంది మద్రాస్ హైకోర్టులో ప్రజావాజ్యం దాఖలు చేశారు. విచారణ జరిపిన న్యాయస్థానం దళితులను అయ్యనార్ ఆలయంలో పూజలు నిర్వహించేందుకు అనుమతించాలని ఉత్తర్వులు జారీచేసినప్పటికీ మరోవర్గం ఈ ఉత్తర్వులను పాటించడం లేదని తెలిసింది. ఈ సమస్యను పరిష్కరింపజేసేలా కళ్లకురిచ్చి తాహసీల్దార్ లూర్దుస్వామి చర్యలు జరిపారు. ఇందులో న్యాయస్థానం ఉత్తర్వుల మేరకు దళితులను స్వామివారి పూజలకు మాత్రమే అనుమతించనున్న ఈ సమావేశంలో నిర్ణయం తీసుకున్నారు. ఆ మేరకు సోమవారం మేళతాళాలతో దళిత వర్గాలకు చెందిన కుటుంబ సభ్యులు ఆలయానికి చేరుకుని భక్తిశ్రద్ధలతో అయ్యనార్ స్వామికి పూజలు నిర్వహించారు.

మధురాంతకం వద్ద ఆమ్నీబస్సులో రూ.4.5 కోట్ల హవాలా సొమ్ము స్వాధీనం

చెన్నై, సెప్టెంబరు 9 (ఆంధ్రజ్యోతి): చెంగల్పట్టు జిల్లా మధురాంతకం వద్ద సోమవారం రాత్రి వాహనాల తనిఖీ సందర్భంగా ఆమ్నీ బస్సులో తరలిస్తున్న రూ.4.5 కోట్ల హవాలా సొమ్ము పట్టుబడింది. చెన్నై మన్నడి ప్రాంతం నుండి పరమక్కుడికి వెళ్లే ఆమ్నీ బస్సులో హవాలా సొమ్ము తరలిస్తున్నారనే సమాచారంతో మధురాంతకం పోలీసులు సోమవారం రాత్రి వాహనాల తనిఖీలు చేపట్టారు. ఆ సమయంలో పరమక్కుడికి వెళుతున్న ఆమ్నీ బస్సులో పోలీసులు తనిఖీ చేసి, ప్రయాణికుల లగేజీ కూడా తనిఖీ చేశారు. ఆ సందర్భంగా మదురై కామరాజర్ రోడ్డుకు చెందిన గణేషన్ అనే వ్యక్తి నాలుగు బ్యాగ్‌ల్లో రూ.3.92 కోట్ల మేర నగదు లభించింది.. ఆ నగదు కారైక్కుడికి చెందిన ఓ పారిశ్రామికవేత్తదని ఆయన తెలిపారు. ఇదే విధంగా ఆ బస్సులోనే వెళుతున్న ట్రిప్లికేన్‌కు చెందిన అంబురోస్ అనే ప్రయాణికుడి బ్యాగ్‌లో రూ.50లక్షలు పట్టుబడింది. వారి వద్ద స్వాధీనం చేసుకున్న నగదు హావాలా సొమ్ము అని పోలీసులు అనుమానిస్తున్నారు. ఆ నగదుకు సంబంధించి ఎలాంటి పత్రాలు లేకపోవడంతో దానిని ఐటీ అధికారులకు అప్పగించారు. నగదు తరలిస్తున్న వారిని పోలీసులు అదుపులోకి తీసుకుని విచారణ జరుపుతున్నారు.

ఈవీఎంల నిర్వహణపై కలెక్టర్ పరిశీలన

వేలూరు, సెప్టెంబరు 9 (ఆంధ్రజ్యోతి): వేలూరు జిల్లా కలెక్టర్ కార్యాలయంలో మంగళవారం ఉదయం కలెక్టర్ సుబ్బులక్ష్మి ఈవీఎంల పనితీరుపై సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, ఓటు అనేది సామాజిక హక్కని, దీనిని ప్రతి ఒక్కరు వినియోగించుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర ఎన్నికల నిర్వాహణ అధికారులు, వేలూరు ప్రాంత డీఎంకే, అన్నాడీఎంకే సహా పలు రాజకీయ పార్టీలకు చెందిన నిర్వాహకులు పాల్గొన్నారు.

విద్యార్థులు క్రీడల్లో కూడా రాణించాలి

● పంచాయతీ అధ్యక్షుడు సంపత్


పోటీలు నిర్వహిస్తున్న దృశ్యం

వేలూరు, సెప్టెంబరు 9(ఆంధ్రజ్యోతి): వేలూరు జిల్లా కోనవట్టంలోని ప్రైవేటు పాఠశాలలో మంగళవారం కరాటే శిక్షణ కమిటీ ఆధ్వర్యంలో విద్యార్థులకు కరాటే పోటీలు జరిగాయి. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా పాల్గొన్న కోనవట్టం పంచాయతీ అధ్యక్షుడు ఎల్.సంపత్ మాట్లాడుతూ విద్యార్థులు విద్యలోనే కాకుండా క్రీడల్లోనూ రాణించాలని, కరాటే, కర్రసాము వంటి రక్షణ విద్యల్లో కూడా రాణించాలని సూచించారు. అనంతరం విజేతలకు బహుమతులు, జ్ఞాపికలు అందజేసి అభినందించారు.

నేడు ముల్లైపెరియార్ డ్యాం భద్రతపై పరిశీలన

ప్యారీస్, సెప్టెంబరు 9 (ఆంధ్రజ్యోతి): ముల్లైపెరియార్ డ్యాం భద్రతపై బుధవారం నిపుణుల కమిటీ పరిశీలించనుంది. తమిళనాడు-కేరళ రాష్ట్రాల సరిహద్దుల్లో వివాదాస్పదమైన ముల్లైపెరియార్ డ్యాం భద్రతను పరిశీలించేందుకు సుప్రీంకోర్టు నియమించిన కమిటీలో జాతీయ నదుల పరిరక్షణ కమిషన్ సభ్యులు, కేంద్ర జలవనరుల కమిషన్, ఇంజనీరింగ్ నిపుణులు సభ్యులుగా ఉన్నారు. ఈ కమిటీ మార్చి 22న ముల్లైపెరియార్ డ్యాం, బేబి డ్యాం, మెయిన్‌డ్యాం, షట్టర్లున్న గేట్లు, నీరు లీకైన ప్రాంతాలను పరిశీలించింది. ఈ కమిటీలో తమిళనాడు ప్రభుత్వ ప్రతినిధిగా జలవనరులశాఖ అదనపు ప్రధానకార్యదర్శి మంగత్‌రామ్‌శర్మ, కావేరి టెక్నికల్ కమిటీ చైర్మన్ సుబ్రమణ్యన్, కేరళప్రభుత్వ జలవనరులశాఖ అదనపు చీఫ్ ఇంజనీర్ ప్రియేష్, బెంగళూరులోని ఇండియన్ సైన్స్ సంస్థ అధికారి ఆనంద్ రామ్, ఢిల్లీలోని జాతీయ విపత్తుల అధికారి వివేక్ త్రిపాఠీ బృందం మంగళవారం రాష్ట్రానికి చేరుకుంది. ఈ బృందం బుధవారం ముల్లైపెరియార్ డ్యాంను పరిశీలిస్తుందని సచివాలయం మంగళవారం విడుదల చేసిన ప్రకటనలో తెలిపింది.



కొత్త చిత్రం పూజా దృశ్యం

'బిగ్‌బాస్' ఫేం విక్రమన్ హీరోగా రొమాంటిక్ కామెడీ మూవీ

'బిగ్‌బాస్' ఫేం విక్రమన్ హీరోగా ప్రీతి కరికాలన్ దర్శకత్వంలో రొమాంటిక్ కామెడీ చిత్రం రూపుదిద్దుకోనుంది. గోల్డెన్ గేట్ స్టూడియోస్ నిర్మించే ఈ చిత్రం ప్రారంభ పూజా కార్యక్రమం సోమవారం నగరంలో జరిగింది. ఇందులో అనేక మంది సినీ ప్రముఖులు పాల్గొని చిత్ర బృందానికి శుభాకాంక్షలు తెలిపారు. ఇంకా పేరుపెట్టని ఈ చిత్రంలో విక్రమన్ సరసన సుప్రీత హీరోయిన్‌గా నటించనుంది. నటుడు జెన్సన్ దివాకర్ ఓ కీలక పాత్ర పోషించనున్నారు. ఈ ప్రాజెక్టు వివరాలను దర్శకుడు ప్రీతి కరికాలన్ వివరిస్తూ, 'నేటి యువతరానికి సరిపోయే కలర్‌ఫుల్ ఎంటర్‌టైనర్‌గా రూపొందిస్తున్నాం. ఈ నెల 10వ తేదీ నుంచి రెగ్యులర్ షూటింగ్ చెన్నై, పరిసర ప్రాంతాల్లో చేస్తాం. సింగిల్ షెడ్యూల్‌లో సినిమా పూర్తి చేసేలా ప్లాన్ చేశామని వివరించారు.

అధర్వ మురళి - లావణ్య జంటగా 'టన్నెల్'

అధర్వ మురళి, లావణ్య త్రిపాఠి జంటగా నటించిన 'టన్నెల్' చిత్రం ఈ నెల 12న విడుదలకానుంది. రవీంద్ర మాధవ దర్శకత్వం వహించగా అశ్విని కాకుమాను ప్రతి నాయకుడిగా నటించారు. తమిళంతో పాటు తెలుగులోనూ విడుదల చేయనున్న ఈ మూవీ ట్రైలర్ ఇప్పటికే రిలీజ్ చేయగా, మంచి స్పందన వచ్చింది. క్రైమ్ అండ్ సస్పెన్స్ థ్రిల్లర్ జానర్‌లో తెరకెక్కించారు. ఇందులో హీరో అధర్వ మురళి పోలీస్ పాత్రలో కనిపించనున్నారు. వరుస హత్యలకు పాల్పడుతున్న సైకోను పోలీసులు ఎలా పట్టుకున్నారన్నదే ఈచిత్ర కథ.ఈసినిమా గురించి దర్శకుడు మాట్లాడుతూ, 'ఇది ఒక యాక్షన్, ఊహించని మలుపులతో కూడిన ఎమోషనల్ స్టోరీ. ఎట్టి పరిస్థితుల్లోనూ తమ సిద్ధాంతాలపై రాజీపడని ఇద్దరు వ్యక్తులకు సంబంధించిన కథ. జీవితాంతం ఎన్నో బాధలు, అవమానాలు పడిన ఒక మాజీ సైనికాధికారికి, నిజాయితీగా పనిచేసే పోలీస్ కానిస్టేబుల్ చుట్టూ కథ తిరుగుతుంది' అని పేర్కొన్నారు.



'టన్నెల్'లో అధర్వ మురళి - లావణ్య త్రిపాఠి

హిజ్రాగా నటించాలనివుంది

● నటి శోభన



వెండితెరపై హిజ్రాగా నటించాలన్న కోరిక ఉందని ప్రముఖ నటి శోభన అంటున్నారు. ఒకపుడు స్టార్ హీరోయిన్‌గా ఓ వెలుగు వెలిగిన శోభన.. వెండితెరకు దూరమైన తర్వాత నృత్య పాఠశాల స్థాపించారు. ఇటీవల ప్రముఖ మలయాళ నటుడు మోహన్‌లాల్‌తో కలిసి 'తుడరుమ్' అనే చిత్రంలో నటించారు. ఈ సినిమాలో ఆమె పాత్రకు అన్ని వర్గాల నుంచి ప్రశంసలు దక్కాయి. ఈ నేపథ్యంలో శోభన తాజాగా ఇచ్చిన ఓ ఇంటర్వ్యూలో తన మనసులోని కోరికను వెల్లడించారు. 'నాకు హిజ్రా పాత్రలో నటించాలన్న ఆశ ఉంది. ఈ విషయంపై ఇద్దరు దర్శకుల తో చర్చించాను. ఆ పాత్రలో నన్ను ప్రేక్షకులు అంగీకరించరని చెప్పారు. కానీ, మలయాళ సూపర్‌స్టార్ మమ్ముట్టిని అలాంటి పాత్ర(లెస్బియన్)లో అంగీకరించలేదా? అని ప్రశ్నించగా, వారి వద్ద జవాబు లేదు. నేను మాత్రం ఇప్పటికీ ఆ పాత్ర చేయాలని ఇష్టపడుతున్నాను. ఆ పాత్ర కోసం శరీరాకృతి, గొంతు, మాటతీరు ఇలా అన్ని మార్చుకోవాల్సి ఉంటుంది. ఒక విధంగా చెప్పాలంటే ఒక సవాల్‌తో కూడుకున్న పాత్ర' అని పేర్కొన్నారు.

చిత్రజ్యోతి

తిరోగమనంలో పయనిస్తున్న సినిమా

- వైరముత్తు

● 19న 'పడైయాండ మావీర' రిలీజ్

సినిమా కొత్త పుంతలు తొక్కుతూ పురోభివృద్ధికి ఆధారమైన టెక్నాలజీ కారణంగా ఇపుడు తిరోగమనంలో పయనిస్తుందని, ఇది విచారించదగిన విషయమని ప్రముఖ సినీ గేయరచయిత వైరముత్తు అన్నారు. నటుడు వి.గౌతమన్ స్వీయ దర్శకత్వంలో రూపొందిన 'పడైయాండ మావీర' చిత్రం విడుదల సందర్భంగా సోమవారం రాత్రి నగరంలో మీడియా సమావేశం జరిగింది. ఇందులో ముఖ్య అతిథిగా పాల్గొన్న వైరముత్తు మాట్లాడుతూ 'గౌతమన్ సమకాలీన యుగంలో మంచి దర్శకుడు. రాజీపడని పోరాటయోధుడు. కళారంగంలో తమిళ జాతి, భాషా స్పృహతో పనిచేసే కొద్దిమంది దర్శకుల్లో ఒకరు. సోదర సమానుడు. అందుకే ఆయన చేపట్టిన ఈ సినిమా సక్సెస్ సాధించాలని కోరుకుంటున్నాను. ప్రస్తుతం సినిమా సక్సెస్ రేటు ఆందోళన కలిగిస్తుంది. ఈ యేడాది ఇప్పటివరకు 200 సినిమాలు విడుదలైతే కేవలం పది చిత్రాలు మాత్రమే విజయం సాధించాయి. రాష్ట్రంలో సినిమా చూసే వారి సంఖ్య తగ్గిపోతోంది. 'పడైయాండ మావీర' చిత్రానికి మంచి కథాబలం ఉంది. ఖచ్చితంగా ఈ మూవీ సక్సెస్ చిత్రాల జాబితాలో చేరుతుందని పేర్కొన్నారు. కాగా, వి.గౌతమన్ హీరోగా నటించిన ఈ చిత్రంలో సీనియర్ నటుడు సముద్రఖని కీలక పాత్ర పోషించారు. ఇతర పాత్రల్లో పూజిత పొన్నాడ, ఇలవరసు, 'బాహుబలి' ప్రభాకర్, శరణ్య, నరేన్, మన్సూర్ అలీఖాన్, రెడిన్ కింగ్‌స్లీ, మధుసూదన రావు, 'నిళల్‌గల్' రవి, 'తలైవాసల్' విజయ్, సాయిదీనా తదితరులు నటించారు. ఉత్తర తమిళనాడులో మెజారిటీ ప్రజలకు ఆశాకిరణంగా నిలిచిన దివంగత 'కాడువెట్టి గురు' జీవిత చరిత్ర ఆధారంగా వీకే ప్రొడక్షన్స్ పతాకంపై నిర్మల్ శవరణన్ రాజ్, ఎస్.కృష్ణమూర్తి సంయుక్తంగా నిర్మించారు.



మీడియా సమావేశంలో పాల్గొన్న వైరముత్తు, చిత్ర బృందం

13న ఇళయరాజాకు సన్మానం



అడయార్, సెప్టెంబరు 9 (ఆంధ్రజ్యోతి): దిగ్గజ సంగీత దర్శకుడు ఇళయరాజాకు ఈ నెల 13న తమిళనాడు రాష్ట్ర ప్రభుత్వం సన్మానించనుంది. 82 యేళ్ళ ఇళయరాజా పలు భారతీయ భాషల్లో అనేక చిత్రాలకు సంగీత దర్శకత్వం వహించిన విషయం తెల్సిందే. ఆయన చిత్రపరిశ్రమలోకి అడుగుపెట్టి 50 వసంతాలు పూర్తి చేసుకున్న సందర్భంగా ఈ సన్మాన కార్యక్రమాన్ని నెహ్రూ ఇండోర్ స్టేడియంలో నిర్వహించనున్నారు. ఈ సన్మాన కార్యక్రమంలో అగ్రనటులు రజనీకాంత్, కమల్ హాసన్ తదితరులు హాజరుకానున్నారు. వీరితో పాటు భారతీయ చలన చిత్ర పరిశ్రమకు చెందిన పలువురు ప్రముఖులు కూడా పాల్గొనేలా ప్రభుత్వం ఆహ్వానాలు పంపనుంది. అయితే ముఖ్యమంత్రి ఎంకే స్టాలిన్ మాత్రం సీఎంగా బాధ్యతలు చేపట్టిన తర్వాత ఒక్క సినీ కార్యక్రమంలో కూడా పాల్గొనలేదు. ఈ నేపథ్యంలో ఇళయరాజా గోల్డెన్ జూబ్లీ సన్మాన కార్యక్రమంలో పాల్గొంటారా? లేదా? అన్నది సస్పెన్స్. నిజానికి ఇళయరాజా పుట్టిన రోజైన జూన్ 2న ఈ సన్మాన కార్యక్రమాన్ని ప్రభుత్వం నిర్వహిస్తుందని భావించారు.

చెన్నైలో 'నవోనియా' దోపిడీ ముఠా ?

● అప్రమత్తమైన పోలీస్‌శాఖ

పెరంబూర్, సెప్టెంబరు 9 (ఆంధ్రజ్యోతి): నగరంలో నవోనియా దోపిడీ ముఠా ప్రవేశించినట్లు పోలీసులు అనుమానిస్తున్నారు. అదే సమయంలో ఆ ముఠా ఆట కట్టించేందుకు అప్రమత్తమయ్యారు. ఈ నవోనియా దోపిడీ ముఠాలో పశ్చిమ బెంగాల్, జార్ఖండ్ తదితర రాష్ట్రాలకు చెందిన యువకులున్నట్లు పోలీసులు అనుమానం వ్యక్తం చేస్తున్నారు. ఆ ముఠా సభ్యులు రద్దీగా ఉండే ప్రాంతాల్లో ప్రవేశించి, వస్తువులు చోరీ చేస్తారనిన్నట్లు గత చరిత్ర చెబుతోంది. అతి భయంకర దోపిడీ ముఠాల్లో ఒకటైన నవోనియా దొంగలు, నగరంలో ప్రవేశించినట్లు విజిలెన్స్ విభాగం కూడా నిర్ధారించడంతో, నగర పోలీసు శాఖ అప్రమత్తమైంది. ముఖ్యంగా, ఎగ్మూర్, చెన్నై సెంట్రల్ రైల్వేస్టేషన్ తదితర ప్రాంతాలకు వచ్చేవారు మరింత జాగ్రత్తగా ఉండాలని, ఆ ప్రాంతాల్లోనే నవోనియా దొంగల సంచారం అధికంగా ఉంటుందని పోలీసువర్గాలు హెచ్చరించాయి. ఇదిలా వుండగా విజిలెన్స్ శాఖ హెచ్చరికలతో ఇప్పటివరకు నలుగురు అనుమానితుల్ని అరెస్ట్ చేసినట్లు సమాచారం. ఆ నలుగురూ నవోనియా ముఠా సభ్యులేనని పోలీసులు అనుమానిస్తున్నారు. నగలు, సెల్‌ఫోన్లు, నగదు తదితర విలువైన వస్తువులు మనకు తెలియకుండానే ఈ ముఠా చోరీ చేస్తుందని, రైల్వేస్టేషన్లు, బస్టాండ్లు, వాణిజ్య కాంప్లెక్స్‌లు, మార్కెట్లు తదితర ప్రాంతాల్లో గ్రూపులుగా విడిపోయే ఈ ముఠా, చోరీకి పాల్పడి తప్పించుకుపోవడంలో నైపుణ్యం కలిగిన వారని పోలీసు వర్గాలు చెబుతున్నాయి. కొన్ని రోజుల పాటు ప్రధాననగరాల్లో మకాం వేసే ఈ ముఠా.. చోరీలకు పాల్పడి సొంతరాష్ట్రానికి చేరుకుంటుందని, అలా ఆ ముఠా వెళ్లిపోయాక మళ్లీ గుర్తించే అవకాశమే ఉండదని తెలుస్తోంది. ఇటీవల మెరీనా బీచ్, మాంబలం రైల్వే స్టేషన్ సహా పలు చోట్ల సెల్‌ఫోన్లు చోరీ చేసింది ఈ ముఠాయేనని అరెస్టయిన నిందితులు స్పష్టం చేసినట్లు తెలిసింది. వారిచ్చిన సమాచారంతో రాష్ట్రంలోని అన్ని పోలీసు స్టేషన్లను కూడా అప్రమత్తం చేసినట్లు తెలిసింది. సాధారణంగా ఒంటరిగా వెళ్లే వారిని లక్ష్యంగా చేసుకుని చోరీలకు పాల్పడే ఈ ముఠా.. ఆ వస్తువులను వెంటనే విక్రయిస్తున్నట్లు పోలీసులు పేర్కొన్నారు. అందువల్ల ఎవరైనా సందేహాస్పద వ్యక్తుల సంచారం గమనిస్తే సత్వరం సమీపంలోని పోలీస్ స్టేషన్‌కు సమాచారం అందించాలని పోలీసులు విజ్ఞప్తి చేస్తున్నారు.

పోలీసు గ్రీవెన్స్‌కు 146 వినతులు



పోలీసుల సమస్యలు తెలుసుకుంటున్న కమిషనర్ అరుణ్

ఎగ్మూర్‌లోని పోలీసు కమిషనర్ కార్యాలయంలో మంగళవారం పోలీసు గ్రీవెన్స్ జరిగింది. ఈ కార్యక్రమంలో కమిషనర్ అరుణ్ పాల్గొని అధికారులు, పోలీసులు, ఇతర విభాగాలకు చెందిన వారి నుంచి 146 వినతులు స్వీకరించారు. బదిలీ, క్వార్టర్స్ కేటాయింపు, వేతనంలో తారతమ్యాలు సహా పలు సమస్యలపై పోలీసులు వినతిపత్రాలు సమర్పించారు. ఈ కార్యక్రమంలో ఇద్దరు అసిస్టెంట్ కమిషనర్లు, 14 మంది సీఐలు, 33 మంది ఎస్‌ఐలు, 8 మంది కార్యాలయ సిబ్బంది, 33 మంది పోలీసులు పాల్గొని తమ సమస్యలు తెలిపారని నగర పోలీసు శాఖ ఒక ప్రకటనలో పేర్కొంది.

ఫొటో ప్రదర్శనకు విశేష స్పందన



ఛాయా చిత్రాలను వీక్షిస్తున్న సందర్శకులు

చెన్నై, సెప్టెంబరు 9 (ఆంధ్రజ్యోతి): స్థానిక బీసెంట్‌నగర్ బీచ్‌లో 'అతుల్య సీనియర్ కేర్' ఆధ్వర్యంలో ఇటీవల 'ఏజింగ్ విత్ జాయ్' పేరుతో నిర్వహించిన ఫొటో ప్రదర్శనకు విశేష స్పందన లభించింది. ఈ ప్రదర్శనకు 400 ఎంట్రీలు రాగా, 30 ఛాయాచిత్రాలను ఎంపిక చేసి ప్రదర్శించారు. గౌరవం, స్థితిస్థాపకత, ఆనందం వంటి ఇతివృత్తాలను ఈ ప్రదర్శన హైలైట్ చేసింది. విజేతలకు నిర్వాహకులు బహుమతులను ప్రదానం చేశారు. దీని గురించి అతుల్య సీనియర్ కేర్ వ్యవస్థాపకులు జి.శ్రీనివాసన్ మాట్లాడుతూ.. అతుల్యలో వృద్ధాప్యం అనేది భయపడకుండా జరుపుకోవాల్సిన ప్రయాణం అని తాము విశ్వసిస్తున్నట్లు తెలిపారు. ఈ పోటీకి లభించిన అఖండ స్పందన, సమాజం వృద్ధులను గౌరవం, ఆనందం, ప్రేరణలను కొత్త కోణంలో చూడటానికి సిద్ధంగా వుందని రుజువు చేస్తోందని వ్యాఖ్యానించారు.

'ఐశ్వర్య' లో అరుదైన శస్త్రచికిత్స

చెన్నై, సెప్టెంబరు 9 (ఆంధ్రజ్యోతి): స్థానిక ఓఎంఆర్‌లోని ఐశ్వర్య హాస్పిటల్‌లో సంక్లిష్టమైన బృహద్ధమని విచ్చేదనం వున్న 54 ఏళ్ల వ్యక్తికి కీలకమైన అత్యవసరమైన 'మోడిఫైడ్ బెంటాల్ విధానంలో' శస్త్రచికిత్సను విజయవంతంగా నిర్వహించారు. ఈ శస్త్రచికిత్సను కార్డియోథొరాసిక్, వాస్కులర్ సర్జన్ డాక్టర్ ఎస్.ముత్తుకుమరన్, ఇంటర్వెన్షనల్ కార్డియాలజిస్ట్ డాక్టర్ కె.దుర్గాదేవి, కార్డియాక్ అనస్థీటిస్ట్ డాక్టర్ ఆర్‌ఎస్ సందీప్ నేతృత్వంలోని వైద్య బృందం నిర్వహించింది. కాంచీపురానికి చెందిన ఆ రోగికి ఆస్పత్రిలో చేరడానికి ముందు మెదడుకు రక్తప్రవాహంలో అకస్మాత్తుగా తగ్గుదల కారణంగా సింకోప్ ఎపిసోడ్, తాత్కాలికంగా స్పృహ కోల్పోవడం, తీవ్రమైన వెన్ను నొప్పి వచ్చేది. ఆస్పత్రిలో అతడిని పరీక్షించగా బృహద్ధమనిలో కనిపించే వైఫల్యాన్ని వెల్లడించాయి. అధిక ప్రమాదాన్ని దృష్టిలో వుంచుకుని వైద్యులు అత్యవసర మోడిఫైడ్ బెంటాల్ విధానాన్ని విజయవంతంగా నిర్వహించారు. ప్రస్తుతం రోగి బాగా కోలుకున్నట్లు వైద్యులు విడుదల చేసిన ప్రకటనలో పేర్కొన్నారు.



ఉపరాష్ట్రపతి ఎన్నికలో ఓటు వేస్తున్న డీఎంకే ఎంపీ కనిమొళి

19 నుంచి ఇంటర్నేషనల్ ఫుడ్ ఫెస్టివల్



వివరాలు వెల్లడిస్తున్న దామోదరన్ తదితరులు

చెన్నై, సెప్టెంబరు 9 (ఆంధ్రజ్యోతి): 'సౌత్ ఇండియా చెఫ్స్ అసోసియేషన్' (సికా) ఆధ్వర్యంలో ఈ నెల 19 నుంచి 21వ వరకు నందంబాక్కంలోని ట్రేడ్‌సెంటర్‌లో 'అంతర్జాతీయ ఫుడ్ ఫెస్టివల్' జరుగనుంది. 4 అంతర్జాతీయ జట్లు, 3 వేల మందికి పైగా చెఫ్‌లు ఈ ప్రదర్శనకు హాజరుకానున్నారు. ఇండియా ట్రేడ్ ప్రమోషన్ ఆర్గనైజేషన్, తమిళనాడు ట్రేడ్ ప్రమోషన్ ఆర్గనైజేషన్ ఈ ఫెయిర్‌కు మద్దతుగా నిలిచాయి. ఈ వివరాలను సికా అధ్యక్షుడు చెఫ్ దామోదరన్, కార్యదర్శి సీతారాం ప్రసాద్, ఉపాధ్యక్షులు అజిత్ జనార్దనన్, కాశీ విశ్వనాథన్ తదితరులు చెన్నైలో జరిగిన మీడియా సమావేశంలో వెల్లడించారు. దేశంలో మొట్టమొదటి డబ్ల్యూఏసీఎస్ ఆమోదం పొందిన జాతీయ పోటీ అని తెలిపారు.

హిట్స్‌తో గూగుల్ క్లౌడ్ ఒప్పందం



ఒప్పంద పత్రాలను ప్రదర్శిస్తున్న గూగుల్ క్లౌడ్ నిర్వాహకులు

చెన్నై, సెప్టెంబరు 9 (ఆంధ్రజ్యోతి): నగరంలోని హిందూస్థాన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ అండ్ సైన్స్ (హిట్స్)తో గూగుల్ క్లౌడ్, క్లౌడ్ రీజిన్ టెక్నాలజీస్ సంస్థలతో మంగళవారం అవగాహన ఒప్పందాలు కుదుర్చుకున్నాయి. ఈ ఒప్పందం ప్రకారం హిట్స్‌లో గూగుల్ క్లౌడ్ డిజిటల్ క్యాంపస్ ఏర్పాటవుతుంది. ఈ సందర్భంగా జెనిసిస్ క్లౌడ్ లేబొరేటరీ కూడా ప్రారంభించారు. ఈ కార్యక్రమాల్లో గూగుల్ క్లౌడ్ రీజినల్ హెడ్ సిద్ధార్థ్ దాల్కావడీ, గూగుల్ ఫర్ ఎడ్యుకేషన్ రీజినల్ మేనేజర్ ప్రియాంకా ప్రియదర్శిని, గూగుల్ వర్క్‌ప్లేస్ స్పెషలిస్ట్ కరణ్ తల్వార్, హిట్స్ ఛాన్సలర్ డాక్టర్ ఆనంద్ ఏకబ్, ప్రొ-ఛాన్సలర్ డాక్టర్ అశోక్ జార్జ్ వర్గీస్, ఇన్‌ఛార్జి వైస్ ఛాన్సలర్ డాక్టర్ ఎస్.గణేశన్, ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ డాక్టర్ అభయ్‌శామ్, డిప్యూటీ డైరెక్టర్ ఎనిద్ వర్గీస్ జేకబ్ తదితరులు పాల్గొన్నారు.

విద్యతోనే ఉజ్వల భవిత

● ఊరా గ్రూప్ సంస్థల చైర్మన్ లక్ష్మీనరసింహారావు

● ఘనంగా ఎస్‌కేపీడీ పాఠశాలల 108వ వార్షికోత్సవం



విద్యార్థులతో అతిథులు, నిర్వాహకులు

ప్యారీస్, సెప్టెంబరు 9 (ఆంధ్రజ్యోతి): తల్లిదండ్రులు, గురువులను గౌరవించి అంకిత భావంతో చదివితే బంగారు భవిత సొంతమవుతుందని ఊరా గ్రూప్ సంస్థల చైర్మన్ ఊరా లక్ష్మీనరసింహారావు సూచించారు. జార్జిటౌన్‌లోని శ్రీకన్యకా పరమేశ్వరి దేవస్థానం (ఎస్‌కేపీడీ) నిర్వహిస్తున్న బాలుర ప్రాథమిక, మహోన్నత పాఠశాలల 108వ వార్షికోత్సవం మంగళవారం మధ్యాహ్నం ఘనంగా జరిగింది. గౌరవ కరస్పాండెంట్ ఎస్‌ఎల్ సుదర్శనం స్వాగతం పలుకగా, ప్రాథమిక పాఠశాల హెచ్‌ఎం ఇ.రమేష్, మహోన్నత పాఠశాల హెచ్‌ఎం ఓరుగంటి లీలారాణి వార్షిక నివేదిక వినిపించారు. ముఖ్యఅతిథిగా హాజరైన లక్ష్మీనరసింహారావు ఈ రెండు పాఠశాలల తరుపున నిర్వహించిన పలు పోటీల్లో పాల్గొని విజయం సాధించిన విద్యార్థులకు బహుమతులు అందజేసి అభినందించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ, ప్రతి విద్యార్థి లక్ష్యాన్ని నిర్దేశించుకుని దానికనుగుణంగా చదివితే ఉన్నత స్థానానికి చేరుకోవచ్చన్నారు. ఎస్‌కేపీడీ సంస్థ ఆధ్యాత్మిక, సామాజిక, విద్య రంగాల అభివృద్ధికి చేస్తున్న కృషి అభినందనీయమన్నారు. జీవిత సవాళ్లను ఎదుర్కొనే ధైర్యానిచ్చే బలమైన శక్తివిద్య అని, అక్షర జ్ఞానంతోనే భవిష్యత్తు ప్రకాశవంతంగా ఉంటుందన్నారు. వాకాటి బాలకుమారస్వామి వ్యాఖ్యాతగా వ్యవహరించిన ఈ వేడుకల్లో విశిష్ట అతిథులుగా నార్త్ చెన్నై డీఈవో ఎలిల్ అరసి, ఎస్‌కేపీడీ ట్రస్టీలు ఊటుకూరు శరత్‌కుమార్, సీఆర్.కిషోర్‌బాబు, పూర్వ విద్యార్థులు, తల్లిదండ్రులు, ఎస్‌కేపీసీ, కేటీసీటీ, మహర్షి విద్యామందిర్, నిర్వాహకులు, విద్యార్థులు పాల్గొన్నారు. కార్యక్రమంలో భాగంగా విద్యార్థులు ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి.

అమిత్‌షాతో రాజకీయ పరిస్థితులపై చర్చించా

● సెంగోట్టయ్యన్



గోపిచెట్టి పాళయం వద్ద మీడియాతో మాట్లాడుతున్న సెంగోట్టయ్యన్

చెన్నై, సెప్టెంబరు 9 (ఆంధ్రజ్యోతి): హరిద్వార్‌కు వెళ్ళాలని ఢిల్లీకి బయలుదేరిన మాజీ మంత్రి సెంగోట్టయ్యన్ సోమవారం రాత్రి కేంద్ర హోంశాఖ మంత్రి అమిత్‌షా, ఆర్థిక శాఖ మంత్రి నిర్మలా సీతారామన్‌ను కలుసుకున్నారు. మంగళవారం మధ్యాహ్నం కోయంబత్తూరు చేరుకున్న ఆయన గోపిచెట్టి పాళయం వద్ద మీడియా సమావేశంలో మాట్లాడుతూ హరిద్వార్‌కు వెళ్ళాలనే ఢిల్లీ చేరుకున్నానని, అదే సమయంలో కేంద్ర హోంశాఖ మంత్రి అమిత్‌షా నుంచి పిలుపు రావడంతో అమిత్‌షాతోను, కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్‌తో భేటి అయ్యానని చెప్పారు. రాష్ట్ర రాజకీయ పరిస్థితులను అమిత్‌షాకు సమగ్రంగా వివరించానన్నారు. అన్నాడీఎంకేలో అన్ని వర్గాలు ఏకమైతే మంచిదేనని కేంద్ర మంత్రులు తనకు తెలిపారని సెంగోట్టయ్యన్ పేర్కొన్నారు.



సచివాలయంలో ముఖ్యమంత్రి స్టాలిన్‌ను మర్యాదపూర్వకంగా కలుసుకున్న థాయ్‌లాండ్‌కు చెందిన డెల్టా ఎలక్ట్రానిక్స్ చైర్మన్ జేమ్స్ ఎన్‌జీ, డెల్టా ఎలక్ట్రానిక్స్ (తైవాన్) సంస్థ వైస్‌చైర్మన్ మార్క్ కో తదితరులు



చెన్నైలో కార్పొరేషన్ స్కూళ్లలో చదువుతున్న 4, 5 తరగతుల విద్యార్థులకు విద్యా విహార యాత్రను ప్రారంభించి వారితో ముచ్చటిస్తున్న మేయర్ ప్రియ



ఇటీవల కజకిస్తాన్‌లో జరిగిన 16వ ఆసియా రైఫిల్ షూటింగ్ పోటీల్లో పతకాలు సాధించిన ఎస్‌ఎం యుగన్, నిలా రాజా బాలు, అంత్ర రాజశేఖర్ మంగళవారం సచివాలయంలో ముఖ్యమంత్రి స్టాలిన్‌ను మర్యాద పూర్వకంగా కలుసుకున్న దృశ్యం.

కూరగాయల దాతలతో వాట్సాప్ గ్రూపు

టీటీడీ అదనపు ఈవో వెంకయ్య చౌదరి సూచన.. బ్రహ్మోత్సవాల్లో రోజుకు పది టన్నులు అవసరం

తిరుమల, సెప్టెంబరు9(ఆంధ్రజ్యోతి): అన్నప్రసాదాలకు కూరగాయలు విరాళంగా టీటీడీకి అందజేస్తున్న దాతలతో ఒక వాట్సాప్ గ్రూపు ఏర్పాటు చేస్తే ఉపయోగకరంగా ఉంటుందని టీటీడీ అదనపు ఈవో వెంకయ్య చౌదరి సూచించారు. కూరగాలయ దాతలతో బ్రహ్మోత్సవాల సందర్భంగా తిరుమలలోని అన్నమయ్య భవనంలో మంగళవారం ఆయన సమావేశమయ్యారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. ఇటీవల అన్నప్రసాద విస్తరణ చేసిన నేపథ్యంలో దాతలు మరింత ముందుకు వచ్చి సహకరించాలని కోరారు. ప్రస్తుతం దాతలు రోజుకు 25 రకాల కూరగాయలు, 6 నుంచి 7 టన్నులు అందజేస్తున్నారని, బ్రహ్మోత్సవాల సమయంలో రోజుకు 10 టన్నులు అవసరముంటుందని అన్నప్రసాదం డిప్యూటీఈవో రాజేంద్రకుమార్, క్యాటరింగ్ ఆఫీసర్ శాస్త్రి వివరించారు. కూరగాయల విరాళాలు 2022లో 5.79 శాతం నుంచి 2025లో దాదాపు 7 శాతానికి పెరిగాయని తెలిపారు. తమిళనాడు, కర్ణాటక, ఏపీకి చెందిన కూరగాలయ దాతలను వెంకయ్య చౌదరి శ్రీవారిప్రసాదాలతో సత్కరించారు.



శ్రీవారి సర్వదర్శనానికి 12 గంటలు

తిరుమల వేంకటేశ్వరస్వామి దర్శనానికి 12 గంటల సమయం పడుతోంది. మంగళవారం సాయంత్రం 5 గంటల వరకు ఉన్న సమాచారం మేరకు వైకుంఠం క్యూకాంప్లెక్స్2లోని 22 కంపార్టుమెంట్లలో సర్వదర్శన భక్తులు, వైకుంఠం క్యూకాంప్లెక్స్1లో 4 కంపార్టుమెంట్లలో టైంస్లాట్ భక్తులు వేచి ఉన్నారు.


ఆదివారం హుండీ ఆదాయం: రూ.2.10 కోట్లు

సోమవారం శ్రీవారిని దర్శించుకున్న భక్తులు: 77,117

తలనీలాలు సమర్పించినవారు: 22,765



ఆశ పెంచుకో.. ఆ ఆలోచన తుంచుకో



ఈ పక్కన ప్రస్తావించిన రెండూ ఉదాహరణలు మాత్రమే. మొబైల్ కొనివ్వలేదనో.. మార్కులు రాలేదనో.. ఆశించిన ర్యాంకు పొందలేదనో.. ప్రేమ విఫలమైందనో.. ఆర్థిక బాధలతో వేగలేకో.. కుటుంబ స్పర్థలతోనో.. కుంగుబాటుతోనో.. ఇలా రకరకాల కారణాలతో, క్షణికోద్రేకంతో కొందరు బలవన్మరణాలకు పాల్పడుతున్నారు. తమ మీద ఆశలు పెట్టుకున్న కుటుంబ సభ్యులను విషాదంలోకి నెట్టేస్తున్నారు. క్లిష్ట పరిస్థితులను ఎదుర్కొంటున్న ఇలాంటి వారిని గుర్తించి భుజం తట్టి..సాంత్వన కలిగిస్తే మరణాన్ని ఆశ్రయించరని చెబుతున్నారు మానసిక నిపుణులు. బుధవారం ఆత్మహత్యల నివారణ దినం సందర్భంగా ప్రత్యేక కథకం.

- తిరుపతి (నేరవిభాగం), ఆంధ్రజ్యోతి

- ఈ ఏడాది జూన్ 25న తొట్టంబేడులో పంట,వ్యక్తిగత రుణాల తీర్చలేక ఆందోళన చెంది రామయ్య(56) అనే రైతు ఉరి వేసుకుని మృతి చెందాడు.
- కోటలో కూలీ పనులు చేసుకునే చల్లప్పన్(28) రకరకాల కష్టాలు వెంటాడటంతో బతుకుపై విరక్తి పెంచుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు.



సిరివెన్నెల సీతారామశాస్త్రి ఓ పాటలో..నొప్పిలేని నిమిషమేది జననమైన మరణమైన జీవితాన అడుగు అడుగునా...నీరసించి నిలిచిపోతే నిమిషమైన నీదికాదు బతుకు అంటే నిత్య ఘర్షణ..అని జీవితం గురించి రెండు ముక్కల్లో చెబుతారు. కానీ కొందరు ఏ కష్టం కలిగినా తట్టుకోలేరు. పెద్ద ఉపద్రవం మీదపడినట్టు భావిస్తారు. తమకే కష్టాలొస్తున్నాయని డీలాపడిపోతారు. ఈక్రమంలోనే క్షణికావేశంతో ఆత్మహత్యకు పాల్పడుతుంటారని మానసిక శాస్త్రవేత్తలు విశ్లేషిస్తున్నారు. కాగా జిల్లా వ్యాప్తంగా ఈ ఏడాది ఆత్మహత్యల సంఖ్య కొంతమేర తగ్గడం శుభసంకేతంగా పోలీసులు పేర్కొంటున్నారు. గత ఏడాది దాదాపు 102 మంది బలవన్మరణాలకు పాల్పడగా గత నెల వరకు 79 మంది ప్రాణాలు తీసుకున్నట్లు జిల్లా క్రైం బ్యూరో గణాంకాలు చెబుతున్నాయి.

అయిన దానికీ కానిదానికీ కొందరు విపరీత ధోరణి కోణంలో చూస్తుంటారు. తీవ్రమైన ఒత్తిడికి గురవుతుంటారు. నైరాశ్యాన్ని నింపుకొంటారు. ఇలాంటి పరిస్థితుల్లోనే క్షణికావేశంలో తనువు చాలించాలని నిర్ణయించుకుంటారు. వీరెవరూ కష్టాలను తట్టుకోడానికి సిద్ధపడరు. పరిష్కారంపై దృష్టి పెట్టరు. ప్రతిదానికీ పరిష్కారమో, ప్రత్యామ్నాయమో ఉంటుందని గుర్తించరు. ఈ అంతర్ముఖులు తమ సమస్య, ఆందోళన, మానసిక ఒత్తిడి గురించి ఎవరితోనూ పంచుకోరు. ముభావంగా, ఒంటరిగా ఉంటుంటారు. ఇలాంటి మానసిక రుగ్మతలతో బాధపడుతున్న వారిని కుటుంబసభ్యులో, బంధువులు లేదా స్నేహితులో గుర్తించాలి. కౌన్సెలింగ్ ఇచ్చేలా ధైర్యవచనాలు చెబితే పెనుముప్పు తగ్గుతుందని నిపుణులు చెబుతున్నారు. సానుకూల దృక్పథం వీరికి నూరిపోస్తే జీవితంపై ఆశపెంచుకుని మరణం ఆలోచన దరిచేరనివ్వరంటున్నారు.

ఎందుకీ విపరీత ధోరణులు

ప్రత్యేక శ్రద్ధ పెట్టాలి



పెరుగుతున్న న్యూక్లియర్ కుటుంబాలు, పిల్లలు దూరం కావడం, తగిన ఆర్థిక వనరులు లేకపోవడం, నిరంతర ఒత్తిడి, సాంఘిక వెనులుబాటు, పోటీ ప్రపంచంలో వెనుకబడటం, ఆరోగ్య సమస్యలతో ఎక్కువ మంది తీవ్రంగా మానసిక ఆందోళన చెందుతున్నారు. ఇలాంటి వారిలో. ఆందోళన, దిగులు, ముభావం, చిరాకు వంటి లక్షణాలు కనిపిస్తాయి. వీరిలో కొందరు ఆత్మహత్యకు పాల్పడుతుంటారు. ఈ లక్షణాలున్న వారి పట్ల ప్రత్యేక శ్రద్ధ చూపాలి. ఒంటరిగా ఉంచకుండా ఎవరోఒకరు తోడుగా వుండాలి. వారి భావాలను ఖండించకుండా సహానుభూతితో మెలగాలి. సమస్యలపై చర్చించకూడదు. వివాద రహిత విషయాలు మాట్లాడాలి. నలుగురిలో కలుపుకోవాలి. అవసరమైతే మానసిక వైద్యుడ్ని సంప్రదించాలి.

- డాక్టర్ కిషోర్, సీనియర్ సైకియాట్రిస్టు, తిరుపతి

సానుకూల దృక్పథమే ఊపిరి



జీవితంలో సమస్యలు సహజం. అవి శాశ్వతం కావని గుర్తించాలి. సహనం, ధైర్యం ప్రదర్శిస్తే పరిష్కారాలు కనిపిస్తాయి. ఆత్మహత్య అంటే పిరికితనం. సమస్య నుంచి పారిపోవడం. కానీ ఇది పరిష్కారం కాదు. ఎంత కష్టమైన ఇబ్బంది ఎదురైనా పోతుందనే నమ్మకం సంపూర్ణ బలాన్నిస్తుంది. ఏ పరిస్థితిలోనూ ఆశను వీడకూడదు. ఆశ ఉంటే శ్వాస వెంటే అంటారు. అదే మార్గం చూపుతుంది. ఆత్మవిశ్వాసం సన్నగిల్లుతోందనే భావన కలిగితే ఆత్మీయుల దగ్గరకు వెళ్ళాలి. కుటుంబ సభ్యులను ప్రేమించడం,క్షమాగుణం అలవర్చుకోవడం నేర్చుకోవాలి. తుది శ్వాస వరకు జీవితాన్ని ఆనందంగా గడపాలనే దృఢచిత్తం పెంచుకోవాలంటే సానుకూల వైఖరి పెంచుకోవాలి

- శ్రీలత, మహిళా పోలీసు స్టేషన్ డీఎస్పీ, తిరుపతి

అన్నప్రసాదం ట్రస్టుకు రూ.10 లక్షల విరాళం



టీటీడీ చైర్మన్‌కు చెక్కు అందజేస్తున్న దాత చిరంజీవి

తిరుమల, సెప్టెంబరు 9 (ఆంధ్రజ్యోతి): టీటీడీ అన్నప్రసాదం ట్రస్టుకు రూ.10 లక్షలు విరాళంగా అందింది. రాజమండ్రికి చెందిన చిరంజీవి విరాళం చెక్‌ను తిరుమలలో టీటీడీ చైర్మన్ బీఆర్ నాయుడికి మంగళవారం అందజేశారు. ఈ కార్యక్రమంలో టీటీడీ బోర్డు సభ్యుడు జ్యోతుల నెహ్రూ పాల్గొన్నారు.

శ్రీవారి సేవలో మహిళా క్రికెటర్




నల్లపురెడ్డి చరణి

తిరుమల, సెప్టెంబరు9(ఆంధ్రజ్యోతి): తిరుమల శ్రీవారిని మంగళవారం భారత మహిళా క్రికెటర్ నల్లపురెడ్డి చరణి దర్శించుకున్నారు. ఈమెకు ఆలయాధికారులు ప్రత్యేక దర్శనం కల్పించి లడ్డూ ప్రసాదాలు అందజేశారు. అలాగే, తెలంగాణ రాష్ట్ర మంత్రి పొన్నం ప్రభాకర్, మాజీ మంత్రి సీహెచ్ మల్లారెడ్డి కూడా స్వామి సేవలో పాల్గొన్నారు.

స్విమ్స్‌లో మూడు పోస్టులకు దరఖాస్తుల ఆహ్వానం

తిరుపతి(వైద్యం), సెప్టెంబరు 9(ఆంధ్రజ్యోతి): స్విమ్స్ యూనివర్సిటీలోని పేథాలజీ విభాగంలో మూడు ప్రాజెక్టు పోస్టులకు దరఖాస్తు చేసుకోవాలని రిజిస్ట్రార్ అపర్ణబిట్లా ఒక ప్రకటనలో కోరారు. ప్రాజెక్టు అసోసియేట్, ప్రాజెక్టు అసిస్టెంటు పోస్టులతోపాటు వ డేటా ఎంట్రీ ఆపరేటర్ పోస్టులకు అభ్యర్థులు తమ దరఖాస్తులను ప్రిన్సిపాల్ ఇన్వెస్టిగేటర్ డీబీటీ నిదాన్ కేంద్ర, స్విమ్స్, తిరుపతికి పోస్టు ద్వారా పంపాలని ఆమె సూచించారు. ఈ నెల 27లోపు ఒరిజినల్ దరఖాస్తులతోపాటు సర్టిఫికెట్లను, ధ్రువీకరణ పత్రాలను సమర్పించాలన్నారు. పూర్తి వివరాలు, అప్లికేషన్ల కోసం స్విమ్స్ వెబ్‌సైట్‌ను సందర్శించాలని వివరించారు.

కంపల్లె రవిచంద్రన్‌కు కీర్తి పురస్కారం



తిరుపతి (కల్చరల్), సెప్టెంబరు 9(ఆంధ్రజ్యోతి) : టీటీడీ సప్తగిరి మాసపత్రిక ప్రత్యేక శ్రేణి ఉపసంపాదకులు డాక్టర్ కంపల్లె రవిచంద్రన్ కీర్తి పురస్కారానికి ఎంపికయ్యారు. హైదరాబాదులోని సురవరం ప్రతాపరెడ్డి తెలుగు విశ్వవిద్యాలయంలో ఈ నెల 23న జరిగే కార్యక్రమంలో ఈ పురస్కారాన్ని అందుకోనున్నారు. ప్రాచీన సాహిత్య విభాగంలో తొమ్మిది, ఆధునిక సాహిత్య విభాగంలో ఏడు గ్రంథాలు, సినిమా సాహిత్య విభాగంలో 13 పుస్తకాలు, అనువాద సాహిత్య విభాగంలో ఆరు గ్రంథాలతోపాటు సుమారు ఐదువేల వ్యాసాలను రవిచంద్రన్ రాశారు. ఇటీవల ఆంధ్రప్రదేశ్ కళారత్న పురస్కారం కూడా అందుకున్నారు.

పిల్లపాళెంలో ఇసుక అక్రమ రవాణా

- అడ్డుకున్న గ్రామస్తులు



పిల్లపాళెంలో ప్రైవేటు భూముల్లో 40 అడుగుల లోతుకు తవ్వడంతో నీటితో నిండిపోయిన గోతులు

రేణిగుంట సెప్టెంబర్ 9 (ఆంధ్రజ్యోతి): ఇసుక రవాణాను పిల్లపాళెంవాసులు అడ్డుకున్నారు. మండలంలోని పిల్లపాళెంలో ప్రైవేటు భూముల్లో నిబంధనలకు విరుద్ధంగా ఇసుక యథేచ్ఛగా తవ్వి తరలిస్తున్నారు. దీనిపై గ్రామస్తులు మంగళవారం ట్రాక్టర్లను అడ్డుకుని పోలీసులకు సమాచారం అందించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ... నిత్యం పదుల సంఖ్యలో ట్రాక్టర్లు మితిమీరిన వేగంతో రాకపోకలు సాగిస్తుండడంతో ఆ దారిలో వెళ్తున్న తమ పిల్లలకు ప్రమాదం జరుగుతుందని గ్రామస్తులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. దీనిపై గతంలో భూ యజమానికి హెచ్చరించామన్నారు. అయితే సదరు భూ యజమాని తిరుపతికి చెందిన వ్యక్తికి తన భూమిని లీజుకు ఇచ్చాడన్నారు. దీంతో నిత్యం ట్రాక్టర్లలో ఇసుక తరలిపోతోందన్నారు. సుమారు నలభై అడుగుల లోతు తవ్వేశారని, ఇటీవల కురిసిన వర్షాలకు ఆ గుంతల్లో నీరు చేరిందన్నారు. ఆ గుంతల్లో తమ పిల్లలు ఈతకు వెళితే ప్రమాదం జరిగే అవకాశం ఉందన్నారు. దీనిపై లీజుదారుడి దృష్టికి తీసుకెళ్లామని అయినా పట్టించుకోకపోవడంతో అడ్డుకున్నామని చెప్పారు. ఇసుక అక్రమ రవాణా చెయ్యకుండా కందకాలు తవ్వాలని గ్రామస్తులు డిమాండ్ చేశారు. సమాచారం అందుకున్న గాజులమండ్యం పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకునే లోగా ట్రాక్టర్లు, ఎక్స్‌కవేటర్లు తరలిపోయాయి.

తీర పోలీస్ స్టేషన్ మరమ్మతులకు ప్రతిపాదనలు

తిరుపతి(కలెక్టరేట్), సెప్టెంబరు 9(ఆంధ్రజ్యోతి): సముద్ర తీరప్రాంతాల వద్ద భద్రతా ఏర్పాట్లను సమన్వయంతో చేపట్టాలని కలెక్టర్ వెంకటేశ్వర్ సంబంధిత అధికారులను ఆదేశించారు. కలెక్టరేట్‌లో మంగళవారం జిల్లా స్థాయి కోస్టల్ సెక్యూరిటీ సమావేశం జరిగింది. కలెక్టర్ మాట్లాడుతూ దుగరాజపట్నం కోస్టల్ పోలీస్‌స్టేషకు మరమ్మతులు, కాంపౌండ్ వాల్ నిర్మాణ అంశాలకు సంబంధించి అంచనాల ప్రతిపాదనలు పంపుతామన్నారు. మత్స్యకారులు వేటకు సమయంలో వెంట ఆధార్ కార్డు, బయోమెట్రిక్‌కార్డును తీసుకెళ్లేలా అవగాహన కల్పించాలని జిల్లా మత్స్యశాఖ అధికారిని ఆదేశించారు. తూపిలి పాళెం, దుగరాజపట్నం బీచ్‌లలో సీసీ కెమెరాలు ఏర్పాటు చేయాలని మెరైన్ పోలీసులకు సూచించారు. దీనికి అవసరమైన నిధులు సమకూరుస్తామన్నారు. మన రాష్ట్రానికి చెందిన బోట్లను గుర్తించడానికి నిబంధనల మేరకు కలర్ కోడింగ్ ఉండేలా చర్యలు తీసుకోవాలన్నారు. సముద్రంపై అక్రమ చేపల వేట జరగకుండా జిల్లా మత్స్యశాఖ, కోస్టల్ సెక్యూరిటీ అధికారులతో కలిసి జాయింట్ పెట్రోలింగ్ చేయాలన్నారు. తమిళనాడు నుంచి మత్స్యకారులు మెకనైజ్డ్ బోట్లతో అక్రమంగా మనవైపున్న సముద్ర జలాల్లో చేపలు పడుతున్నారని అధికారులు తెలపగా ప్రభుత్వం దృష్టికి తీసుకెళతామని కలెక్టరు చెప్పారు. ఈ సమావేశంలో స్పెషల్ బ్రాంచ్ డిప్యూటీ ఎస్పీ వెంకటరమణ డిప్యూటీ ఎస్పీ కోస్టల్ సెక్యూరిటీ పోలీసు బాలిరెడ్డి, అధికారులు విజయకుమార్, సురేష్, రాజేష్ తదితరులు పాల్గొన్నారు.

తుడా ప్లాట్ల ఈ-వేలానికి విశేష స్పందన



ఈ-వేలం ప్రక్రియను పరిశీలిస్తున్న డాలర్ దివాకర్ రెడ్డి

తిరుపతి, సెప్టెంబరు 9 (ఆంధ్రజ్యోతి) : రేణిగుంట-తిరుపతి హైవే మార్గంలో పద్మావతినగర్‌లోని సూరప్పకసం తుడా లేఅవుట్‌లోని తుడా స్థలాలను ఈ- వేలం ద్వారా విక్రయిస్తున్నారు. ఈనెల 4న ప్రారంభమైన ఈ-వేలం 17వ తేదీతో ముగియనుంది. 277 ప్లాట్లకు గాను ఇప్పటివరకు 35 ప్లాట్ల విక్రయించారు. తద్వారా దాదాపు రూ.13 కోట్ల మేర ఆదాయం లభించినట్లు తుడా చైర్మన్ డాలర్స్ దివాకర్ రెడ్డి తెలిపారు. మంగళవారం ఆయన వేలం ప్రక్రియను పరిశీలించారు. వేలం వివరాలను తుడా సెక్రటరీ డాక్టర్ ఎస్వీ శ్రీకాంత్‌బాబు వివరించారు. పేద మధ్యతరగతి ప్రజలకు అందుబాటులో ఉండేలా చదరపు గజం రూ.14వేలకు ధర నిర్ణయించామని దివాకర్‌రెడ్డి తెలిపారు. ఈఅవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

నేడు అమరావతి క్వాంటమ్ వ్యాలీ హ్యాకథాన్ సెమీ ఫైనల్స్

తిరుపతి (విశ్వవిద్యాలయాలు), సెప్టెంబరు 9 (ఆంధ్రజ్యోతి): అమరావతి క్వాంటమ్ వ్యాలీ హ్యాకథాన్ సెమీఫైనల్స్ పద్మావతి మహిళా యూనివర్సిటీలో బుధవారం నిర్వహించనున్నారు.ఉదయం 10 గంటలకు వర్సిటీ ఇంజనీరింగ్ కాలేజీ ధృతి ఆడిటోరియంలో కార్యక్రమం ప్రారంభంకానుంది.సాంకేతికత-సామాజిక సమస్యల పరిష్కారం అంశంపై విన్నూత్న ఆలోచనలకు ఇది వేదిక కానుంది. తిరుపతి, నెల్లూరు, కడప జిల్లాలకు చెందిన 220మంది విద్యార్థులు,పలు సాంకేతిక సంస్థలు, వివిధ ప్రభుత్వశాఖల అధికారులు, స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు ఇందులో పాల్గొంటారు. పాల్గొన్న వారికి వివిధ థీమ్‌లపై పోటీలు నిర్వహిస్తారు. విజేతలకు నగదు బహుమతులు ప్రదానం చేస్తారు. దీంతోపాటు విజేతలనను ఫైనల్స్‌కు పంపనున్నారు.

పల్లంపేటలో దోపిడీ దొంగల అరెస్టు

- పోలీసుల అదుపులో కుదువ వ్యాపారి

ఏర్పేడు, సెప్టెంబరు 9 (ఆంధ్రజ్యోతి): ఏర్పేడు, శ్రీకాళహస్తి మండలాల్లో ఒంటరి మహిళలపై అఘాయిత్యాలకు పాల్పడడమే కాకుండా వారి ఆభరణాలను దోచేకెళ్లే వారిని అరెస్టు చేయడమేకాకుండా వారికి సహకరించిన కుదువ వ్యాపారిని పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. ఏర్పేడు సీఐ శ్రీకాంత్‌రెడ్డి తెలిపిన వివరాలు... వెంటకగిరికి చెందిన ప్రసాద్ తన కారులో సొంతపనుల నిమిత్తం తిరుపతికి గతనెల 30న బయలుదేరాడు. మార్గమధ్యంలోని పల్లంపేట వద్ద కారు మర్మతులకు గురైంది. దీంతో రోడ్డుపక్కన కారును మరమ్మతులు చేసుకుంటుండగా శ్రీకాళహస్తి మండలం ఇంద్రపల్లికి చెందిన ప్రసాద్, పాతగుంట దళితవాడకు చెందిన హరి కారు యజమాని ప్రసాద్‌ను పలకరించారు. మరమ్మతులకు సహకరించారు. రాత్రి 8 గంటలైనా కారు రిపేర్‌కాలేదు. ఈక్రమంలో ముగ్గురు కలిసి సమీపంలో బ్రాందీషాపులో మద్యం తాగారు. మద్యం మత్తులో ఉన్న ప్రసాద్ బంగారు నగలను, సెల్‌ఫోన్‌ను అపహరించుకుపోయారు. మత్తు నుంచి తేరుకున్న ప్రసాద్ తన వస్తువులు చోరీ అయినట్లు గుర్తించాడు. మూడు రోజుల పాటు ఇంద్రపల్లికి, పాతగుంట దళితవాడకు వెళ్లి నగలు, సెల్‌ఫోన్ ఇవ్వాలని కోరారు. వారు నగలను పల్లంపేటలో ఉన్న ఓ కుదువ వ్యాపారికి కుదువ పెట్టినట్టు చెప్పారు. దీనిపై ప్రసాద్ ఏర్పేడు పోలీసులకు ఫిర్యాదు చేశాడు. సీఐ శ్రీకాంత్‌రెడ్డి విచారణ చేపట్టారు. విచారణలో చోరీ జరిగినట్లు గుర్తించారు. చోరీ చేసిన ఇద్దరిని, కుదవు పెట్టుకున్న వ్యాపారిని మంగళవారం సాయంత్రం అదుపులోకి తీసుకున్నారు. వీరిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

- నయా పంథా

గ్యాస్ కట్టర్‌తో తలుపు కోసి...!

వాంపల్లెలో చోరీకి పాల్పడ్డ దొంగలు



తలుపును గ్యాస్ కట్టర్‌తో కాల్చిన దుండగులు

శ్రీకాళహస్తి, సెప్టెంబరు 9(ఆంధ్రజ్యోతి): శబ్దం రాకుండా సరికొత్త విధానంతో దొంగలు చెలరేగారు. గ్యాస్‌కట్టర్‌తో తలుపును కాల్చి ఇంట్లోని బంగారు ఆభరణాలను లూటీ చేశారు. ఈ ఘటన శ్రీకాళహస్తి మండలం వాంపల్లెలో జరిగింది. నెల రోజుల వ్యవధిలో వాంపల్లిలో ఆరు వరుస చోరీలు వెలుగు చూశాయి. ఇంటికి తాళం వేసినట్లు కనిపిస్తే చాలు... రాత్రికి రాత్రే దొంగలు తెగబడుతున్నారు. ఒంటరి మహిళగా జీవనం సాగించే కరణం బుజ్జమ్మ సోమవారం రాత్రి సమీప గ్రామంలోని బంధువుల ఇంటికి వెళ్లింది. ఉదయం ఇంటికి చేరుకోగానే ప్రధాన ద్వారాన్ని కాల్చి దొంగలు లోపలకు చొరబడినట్టు గుర్తించింది. శ్రీకాళహస్తి రూరల్ పోలీసులకు ఫిర్యాదు చేసింది. సీఐ గోపి క్లూస్ టీంతో ఘటనా స్థలానికి చేరుకుని విచారణ చేపట్టారు. వరుస చోరీలు జరగడంపై లోతుగా ఆరా తీశారు. ప్రత్యేకించి మంగళవారం వెలుగు చూసిన చోరీలో శబ్దంరాకుండా గ్యాస్‌కట్టర్ ఉపయోగించడంతో పరిసరాల్లో పలు నమూనాలను సేకరించారు. మహిళ ఫిర్యాదు మేరకు 16 గ్రాముల బంగారు ఆభరణాలు చోరీ జరిగినట్లు ఫిర్యాదుతో కేసు నమోదు చేసి దర్యాప్తు చేశారు.



చోరీపై విచారణ చేస్తున్న సీఐ గోపి

ఐదుగురు స్మగ్లర్ల అరెస్టు

- 9 ఎర్రచందనం దుంగల స్వాధీనం



పట్టుబడ్డ స్మగ్లర్ల అరెస్టు చూపుతున్న టాస్క్‌ఫోర్సు పోలీసులు

మంగళం, సెప్టెంబరు9(ఆంధ్రజ్యోతి): టాస్క్‌ఫోర్సు పోలీసులు మంగళవారం ఐదుగురు స్మగర్లను అరెస్టు చేశారు. టాస్క్‌ఫోర్సు ఎస్పీ శ్రీనివాస్ ఆధ్వర్యంలో ఆర్ఐ సాయిగిరిధర్‌కు చెందిన ఆర్ఎస్ఐ వినోద్‌కుమార్ బృందం రాజంపేట అటవీపరిధిలోని ఎస్ఆర్‌పాళెం ఫారెస్టు బీటులో మంగళవారం కూంబింగ్ నిర్వహించారు. ఈక్రమంలో రాళ్లమడుగు తుమ్మలబైలు జంక్షనుకు చేరుకోగా కొంతమంది ఎర్రచందనం దుంగలు మోసుకువెళుతూ టాస్క్‌ఫోర్సు పోలీసుల కంటబడ్డారు. వారిని వెంబడించి ఐదుగిరిని పట్టుకున్నారు. వారి నుంచి 9 ఎర్రచందనం దుంగలు స్వాధీనం చేసుకున్నారు. పట్టుబడ్డ వారు తమిళనాడుకు చెందినవారుగా గుర్తించారు. దుంగలతో సహా స్మగ్లర్లు తిరుపతి టాస్క్‌ఫోర్సు పోలీస్‌స్టేషన్‌కు తరలించి సీఐ సురేష్‌కుమార్ కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.